ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

మార్చి 19, 2017

స్నేహ

KSR02B161 C

E

ENTERED

మహానటి

ఆ పాత కొత్త స్టైల్

60ల నాటి బాలీవుడ్ చిత్రాల్లో కాస్ట్యూమ్స్, హెయిర్‌స్టైల్, లొకేషన్స్ ఇలా ప్రతిదీ ప్రేక్షకుల మనసుని ఎంతగానో ఆకట్టుకున్నాయి. అభిమానుల్లో రిజిస్టరైన ఆ వింటేజ్ స్టైల్స్, లొకేషన్లని కొత్త చిత్రాల్లోనూ చొప్పించేందుకు ఇష్టపడుతుంటారు నేటి దర్శకులు. 2000 నుండి ఇటీవలే విడుదలైన రంగూన్ చిత్రం వరకు కొత్తదనాన్ని అద్దుకున్న ఆ పాత గెటప్‌లలో నేటి తారలూ పేరుతెచ్చుకున్నారు... విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో వచ్చిన రంగూన్‌లో 40ల నాటి పాత సెట్లే కాదు షాషిద్ కపూర్, సైఫ్ అలీఖాన్, కంగనాల ఆ పాత గెటప్పులూ ప్రేక్షకులని ఆకట్టుకున్నాయి. మగువ కురుల కంటే నెత్తిన పెట్టిన గులాబి మొదట ఆకట్టుకునేంత అందంగా వున్న ఆ పాత స్టైల్ గుర్తుందా. 'బాంబే వెల్ వెట్'లో అదే కాస్ట్యూమ్‌లో కనిపిస్తుంది అనుష్క శర్మ. కొంత ఇంగ్లీష్ అందాన్ని అద్దుకున్నట్టు వుండే క్రాఫ్‌లు, అలనాటి స్విమ్‌సూట్ స్టైల్, అంగ్రేజీ బాబు లుక్స్‌లో కత్రినా కైఫ్(యువరాజ్), ఇషాగుప్త (రుస్తుమ్), షారుక్‌ఖాన్ (దేవదాస్) చిత్రాల్లో ఒదిగిపోయారు. మేరానామ్ చిన్ చిన్ చు పాటలో చాంగై స్టైల్ హెయిర్ స్టైల్ గుర్తుంది కదా... 'చాందినీ చౌక్ టు చైనా' చిత్రంలో ఆ తరహా స్టైల్‌లో అదరగొట్టింది దీపిక. నాటి చిత్రాల ద్వారా యువతని ఉర్రూతలూగించిన ఆ కాస్ట్యూమ్స్‌తో షాహిద్ కపూర్(షాన్‌దార్), ప్రియాంక చోప్రా (తేరీ మేరీ కహానీ), సోనమ్ కపూర్(ప్రేమ్‌రతన్ ధన్ పాయో), అభిషేక్ హ్యాట్‌స్టైల్ (గురు), ఫావద్ ఖాన్(ఖూబ్‌సూరత్), రేఖ (పరిణీత), జాక్వెలిన్ ఫెర్నాండెజ్(రాయ్), రన్‌వీర్ సింగ్(గూండే), రన్‌బీర్ కపూర్(బర్ఫీ), ఆయుష్మాన్ ఖురానా(హవాయీ జాదా) ఎలా ఒదిగిపోయారో మీరే వీక్షించండి.

KSR02B161
ENTERED

సేవ

వెలుగు చుక్క



ఆడపిల్ల ఒంటరిగా కనిపిస్తే చాలు మాయమాటలతో కొందరినీ, కిడ్నాప్ చేసి మరికొందరినీ, చిన్నపిల్లలైతే తినుబండారాల ఆశచూపి సుదూర ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. తల్లిదండ్రుల పేదరికాన్ని, నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని డబ్బు ఆశజూపి పెళ్లి పేరుతో కొందరినీ, పనిమనిషి అంటూ ఇంకొందరినీ తీసుకెళ్తారు. వీరందరినీ సరోగసీ తల్లిగా, అవయవదాతలుగా, యుక్తవయస్సు వచ్చిన ఎక్కువ మంది ఆడపిల్లలను వ్యభిచార కూపంలోకి నెట్టి వారి జీవితాన్ని చిదిమేస్తున్న ఘటనలు మనకు నిత్యం తెలుస్తూనే ఉన్నాయి. ఎందరో ఆడబిడ్డల జీవితాలను అంగడిబొమ్మలా వ్యాపారం చేసి ఆడుకుంటున్నారు. జార్ఖండ్ గిరిజన బాలికల వ్యథల్లో ఇది ముందుండేది. ఈ సెక్స్‌మాఫియా నుండి వేలాది మంది ఆడబిడ్డలను రక్షించేందుకు నడుం బిగించింది రష్మి తివారీ.

అభం శుభం తెలియని ఓ చిన్నారి ఇంటి ముందు ఒంటరిగా ఆడుకుంటోంది. ఆ సమయంలో అటుగా వెళ్తున్న వ్యక్తి చూపు పాపపై పడింది. నెమ్మదిగా పాప దగ్గరికెళ్లి సమోసా, గులాబ్‌జామ్‌లంటూ ఆశ జూపాడు. తన మాయామాటలు నమ్మిన చిన్నారి ఆ మోసగాడి చేయి పట్టుకుని వెళ్లింది. అలా తనను అంతు చిక్కని ప్రాంతానికి తీసుకెళ్లి మరొకరికి అప్పజెప్పాడు. పలకా బలపం పట్టాల్సిన వయస్సులో వెట్టిచాకిరీ చేయడానికి ఒక ఇంటికి పని మనిషిని చేశాడు. యుక్తవయసు రాగానే బలవంతంగా వ్యభిచార కూపంలోకి నెట్టారు. ఆమె జార్ఖండ్‌కు చెందిన సూల. ఐదేళ్ల వయస్సులో కనుమరుగైన సూల ఈ రోజు వరకు జాడ లేదు.

అమ్మాయిల అక్రమ రవాణాలో జార్ఖండ్ ముందుంది. ఓ ఆపరేషన్‌లో అస్సాంలోని రంగియా రైల్వేస్టేషన్‌లో అక్రమ రవాణా అవుతున్న 58 మంది అమ్మాయిలను కాపాడితే వారిలో 18 మంది జార్ఖండ్‌కు చెందినవారే. అక్రమ రవాణాదారులకు... సమాజం గురించి అవగాహన లేని అమ్మాయిలు, ఆడపిల్లలు భారమైన తల్లిదండ్రులే టార్గెట్. బాధలు భరించలేక తిరిగి వద్దామన్నా ఎక్కడ ఉన్నారో కనుక్కోలేని పరిస్థితిలో ఉంచుతారు. ఒకవేళ బయటపడాలని సాహసిస్తే ప్రాణాలకు ప్రమాదమే. భారతదేశంలో ప్రతి సంవత్సరం అక్రమ రవాణా కింద 5 లక్షల మందిని తరలిస్తున్నారు. వీరిలో 20 వేల మంది పిల్లలు తూర్పు ప్రాంతం వారే. మన దేశంలో కఠినమైన చట్టాలున్నప్పటికీ ఇలాంటి సంఘటనలు జరగడం ఎంతో బాధాకరం.

ఎవరో ఒకరు

మొదట్లో పిల్లలను చాకలేక కుటుంబపోషణ భారమవ్వడంతో ఆడపిల్లలని అమ్ముకునేవారు. అలా మొదలైన ఈ విధానం రాను రాను ఆ ఊరిలో ఆడపిల్లలే కరువయ్యారు. దీంతో గ్రామంలోని యువకులకు పెళ్లిళ్లు కావడం కష్టమైంది. ఇలా అయితే వంశాభివృద్ధి జరగదని కొందరు యువతులను అమ్మకుండా ఉంచుకొనే వారు. కానీ వీరిలోని అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న బంధువులే పిల్లల్ని కనమని ప్రోత్సహించేవారు. ఆడబిడ్డ పుట్టగానే బంధువే ఏజెంట్‌గా మారి తల్లిదండ్రులకు డబ్బు ఆశ జూపి పిల్లలను తీసుకెళ్లి అమ్ముకునేవారు. ఇళ్లల్లో పనిమనిషిగా తీసుకెళ్లిన వారిపై నిత్యం యజమాని చేసే వికృత చేష్టలను నోరెత్తకుండా

భరించాల్సిందే. కొందరిని పిల్లలు లేని జంటలకు పిల్లల్ని కని ఇవ్వాల్సిందేనని బలవంతంగా తల్లిని చేస్తారు. మరికొందరి చేత వ్యభిచారం చేయిస్తూ నరకం చూపిస్తారు. ఇలాంటి జాబితాలో సూల, అంజలి లాంటి అమ్మాయిలెందరో.

అక్రమ రవాణా ద్వారా తరలించే అమ్మాయిలను లక్ష నుంచి 4 లక్షల ధరకు అమ్ముతుంటారు. అమ్మాయిల శాతం తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో 8 లక్షల వరకూ అమ్ముతారు. ఇలా వారి జీవితాల్ని అంగడి బొమ్మగా తయారు చేస్తారు. వారెక్కడుంది కూడా తెలుసుకోలేని స్థితిలో ఉంచుతారు. అమ్మాయిలను తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లకుండా కట్టడి చేస్తారు. వీరిని వస్తువులు మార్చినట్లు రోజుకో ప్రాంతంలోకి మారుస్తారు.

ఇలా మార్పు తెచ్చింది..

ఇవన్నీ తెలుసుకున్న రష్మి తివారీ ముందుగా తల్లిదండ్రుల్లో మార్పు తీసుకు రావాలనుకుంది. అహాన్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ అనే సంస్థను స్థాపించింది. దీని ద్వారా మొదటగా ఆదిమవాసుల బాలికలకు, మహిళలకు అవగాహన కల్పించాలనేదే ఆమె ఉద్దేశం. అమ్మాయిలను అమ్మిన తర్వాత వారు పడే బాధలను సీడీల ద్వారా చూపుతూ వారిలో మార్పు కోసం ఎంతగానో కృషి చేస్తోంది. వారు ఆర్థికంగా నిలదొక్కుకోడానికి వృత్తి నైపుణ్య కోర్సులను నేర్పించడమేగాక, గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి అవసరమైన భరోసాను అందించింది. ప్రతి తల్లి దగ్గరికి, గర్భిణీల దగ్గరికి వెళ్లి తమ బిడ్డలను అమ్మవద్దని, అమ్మితే వారు ఎదుర్కొనే పరిణామాలను వివరించేది. అమ్మాయిలకు చదువు ముఖ్యమని చెప్పడమేగాక ఆహారంతోబాటు పుస్తకాలు, పెన్నులు ఇచ్చేది. మహిళా సాధికారత గురించి అవగాహన కల్పించే పుస్తకాలు చదివించేది. ఒకప్పుడు వ్యభిచార కూపంలో మగ్గి బయటపడిన అంజలి నేడు గిరిజన బాలికల కోసం ఏర్పాటు చేసిన సాధికారిత సెంటర్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. అక్కడి అమ్మాయిలందరినీ పోగేసి అవగాహనా సదస్సులను నిర్వహిస్తుంది. వ్యభిచార కూపం నుండి బయటపడ్డ మహిళలకు కొత్త జీవితాన్ని ప్రారంభించేలా ఆత్మస్థైర్యాన్ని నింపి పురోగతి వైపు నడిపిస్తుంది రష్మితివారీ.

కుమారి

ఇండెక్స్

వివరం................3
మాటల మహారాజు

స్టార్........4
ఐరన్ మారథాన్

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం..........10
ముక్కుతో ఊదేస్తాడు

విజేత.............. 11
పంటి విలుకాడు

కవిత్వమ్..............14
బంగారు తల్లి

తెలుసా....................15
నీరు.. నీరు.. నీరు...

కథ 16
గురువు..!

ప్రత్యేకం....................20
ఈల భాష

రుచి.....................21
దొండకాయ పులుసు

బాల నేస్తాలు............23
అక్రమాన్ని అడ్డుకున్నారు

పద వికాసం........24

మహానటి

అట్టమీది కథ...6

నా కళ్లతో - 12

కథ నిజమైంది..!

శభాష్ కల్లెన్

ప్రకృతి విధ్వంసం పనికి రాదు. ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకొనే దిశగా మనం ప్రయాణించాలని తెలిపిన మడ మనిషి కథనం ఆలోజింపచేసింది. మడ అడవుల్ని పెంచి, అందరి చేతా శభాష్ అనిపించుకున్న కల్లెన్ నిజంగా పర్యావరణ ప్రేమికుడు.

-మంకు శ్రీను, కొప్పర్రు

స్పిన్ మాంత్రికురాలు

భారతీయ మహిళా క్రికెట్ టీమ్‌లో నలుగురు అగ్ని కణాల్లాంటి క్రీడాకారిణుల్లో ఒకరైన దీప్తి భగవాన్ పరిచయం ఆకట్టుకుంది. అటు బ్యాట్స్‌మెన్‌గా, ఇటు బౌలర్‌గా రాణించగలగటం అభినందనీయం. భారత క్రీడారంగం ప్రపంచ స్థాయి ఖ్యాతిని దక్కించుకోవడంలో ఇలాంటి క్రీడాకారుల ఆవశ్యకత లేకపోలేదు. ఆడపిల్లలని చులకనగా చూసే వారు సరే వారికి భిన్నంగా మనం ఏం చేస్తున్నాం అని అలోజింపచేయడంతోపాటు స్వయం కృషితో జీవితంలో పేరుతెచ్చుకున్న మహిళల గురించి పరిచయం బాగుంది. చిన్న చిన్న జంతువుల నుంచి పెద్ద ఎలుగుబంటి, ఏనుగుల కోసం ప్రత్యేకంగా



సొరంగ మార్గాలని ఏర్పాటు చేయడం మెచ్చుకోవాల్సిన పనే. ఇలాంటివి మన దేశంలో కూడా రావాలని కోరుకుంటున్నాం. కొప్పాడోసియా ఎయిర్ బెలూన్ విన్యాసాలు అబ్బురపరిచాయి. తెలుగు చిత్రాలతోపాటు వివిధ భాషల్లో అద్భుత నటన కనబరిచిన కేరళ అమ్మాయి భావన గురించి తెలిపిన స్టార్, పరీక్ష అందరికీ అట్టమీది కథ, గుహాగ్రామం, ఒక గుప్పెడు రాత్రులు, అలల కవిత బాగున్నాయి. కిసుక్కు చిత్రం స్టైలిష్‌గా అనిపించింది.

-ఆకాంక్ష, అనంతపురం

గుహాగ్రామం

కొండ ప్రాంతాల్లో గుహలు వుండడం సహజమే కానీ అలాంటి గుహల్లో కొందరు జీవనం ఉండడం, తద్వారా అవి కేవ్ విలేజెస్‌గా మారడం ఆశ్చర్యపరిచే విషయం. అక్కడి ప్రజలకు టీవీలు, ఆధునిక సదుపాయాల గురించి తెలీడంతోపాటు, డోర్ నెంబర్లు కూడా కలిగుండడం అబ్బురపరిచింది. కాలానికి తగట్టు మనిషి మారాలనుకుంటే తప్పులేదు కానీ రాళ్లు మారలేదనుకోవడం అది కనిపెట్టేందుకు అబ్రహం రాతిలోకి ప్రవేశించాలనుకోవడం నిజంగా వింతే. పరీక్షల సమయంలో పిల్లలతోపాటు పెద్దలు తీసుకోవాల్సిన

జాగ్రత్తలతోపాటు ఎన్నో మంచి విషయాలని ప్రస్తావించిన అట్టమీది కథ ఆకట్టుకుంది. అనాథ పిల్లలను వదిలేయకుండా ఆదరించడం ఎంతైనా అవసరమని అలోజింపజేసిన దత్తపుత్రుడు కథ, బాలల పంచాయతీ, విలన్ హీరోలు, స్పిన్ మాంత్రికురాలు, మడమనిషి, మాస్క్ వేస్తే, అద్భుత ద్వీపాలు, బూరల ఊరు బాగున్నాయి. నవ్వుల్ పువ్వుల్ నవ్వుతెప్పించాయి.

- శ్రీనివాస్, విజయవాడ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4,
ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

మాటల మహారాజు



పేరుకు తగ్గట్టు రికార్డులు కొట్టాడు. ఆయన మాటలకు తగ్గట్టు మహారాజు అనిపించుకుంటున్నాడు. రాజుల కాలంలో కలిసిపోయిన 100 భాషల్ని మాట్లాడేస్తాడీ మారాజు మరి. ఓ ఎనిమిది భాషలు మాట్లాడేస్తే నువ్వు గ్రేటు గురూ అనేయొచ్చు. అలాంటిది సెంచరీ పలికేస్తే... ఇక ఆయన గురించి మాట్లాడకుండా ఉండలేం కదా. ఆయుష్షులోను సెంచరీకి దగ్గరలోనున్న 86 ఏళ్ల రికార్డో బర్టనీ చిన్నప్పుడు ఎలిమెంటరీ విద్యతోనే చదువుకి గుడ్‌బై చెప్పాడంటే నమ్మడం కష్టమే. మరి ప్రాచీన భాషలపై ప్రేమెలా పుట్టుకొచ్చింది ఎలా నేర్చుకుందీ తెలుసుకోండి.

ఇటలీలోని రిజైయో ఎమిలైయా అనే చిన్న పల్లెటూరులో కాప్రారా రైతు కుటుంబంలో జన్మించాడు రికార్డో. గణితమంటేనే భయపడే రికార్డో ఎలిమెంటరీ విద్యతోనే చదువుకు గుడ్‌బై చెప్పాడు. అందరి యువకుల్లా ఊరిలో తొలుత వ్యవసాయం చేయడం ఆరంభించాడు. కానీ తక్కువ రోజుల్లోనే తను వ్యవసాయానికి సూటు కాలేనని తెలుసుకున్నాడు. మరింకేం చేయాలి అని సాలోచనలో పడ్డాడు. తనతో తనలో మాట్లాడి మాట్లాడి చివరకు ఓ విషయం దగ్గర ఆలోచన ఆగింది. అవునూ పుస్తకాలు, సాహిత్యం, పూర్వపు రాజుల్లా డైలాగులు అంటే పడి చస్తాను కదా వాటినే నేర్చేసుకుంటే ఎలా ఉంటుందనే ఐడియా తట్టింది. అయితే ఎలిమెంటరీతోనే ఆపేసిన చదువుకు కొనసాగింపుగా కాదు. తానే సొంతగా నేర్చుకుని కాస్తైనా ఉపయోగపడతాడని అనిపించుకోవాలని అనుకున్నాడు. కాస్త కాదు ఏకంగా వంద భాషలకు మళ్లీ ఊపిరిలూదాడు రికార్డో. ఆయన ద్వారా అవి అంతరించిపోకుండా ఉండటమే కాక యువత కూడా సరదాగాను, సీరియెస్‌గాను వాటిని నేర్చుకుని అధ్యయనం చేయాలని అనుకుంటోంది.

ఫ్రమ్ రష్యా విత్ లవ్

రికార్డో తండ్రి కమ్యూనిస్టు పార్టీ సభ్యుడేగాక మాజీ మేయర్ కూడా కావడంతో వాళ్లింట్లో ఎన్నో రష్యన్ పుస్తకాలు ఉన్నాయి. బూజు పట్టిన పుస్తకాలను ఎంతో ఆసక్తిగా తెరచిన రికార్డోకు అందులోని భాష అర్థం కాక నిరాశ చెందాడు. అయినా వాటినెలాగైనా చదివేయాలని రష్యన్ వ్యాకరణ పుస్తకాలను తెచ్చుకొని తిరగేశాడు. అంతేగాక తనకిష్టమైన ఇటాలియన్ రచయిత లియో టాల్‌స్టాయ్ రచనలను చదవడం ఆరంభించాడు. అలా చదువరిగా మారాడు. ఇటలీ టూ రష్యా సాగిపోయిన మాటలు అటుగా రష్యన్, ఉక్రెయిన్ లాంటి తూర్పు దేశాల ప్రాచీన భాషలపై మక్కువ పెంచేశాయి. అలా చదువుతూ చదువుతూ మంచి పట్టు సాధించాడు. ఆ పట్టుతో కలం పట్టి రచనలు చేయడం మొదలెట్టాడు. అలా 18 సంవత్సరాలు అదే పనిగా అనువాదం చేస్తూ విదేశీ సంస్కృతి గురించి చాలా లోతుగా అధ్యయనం చేశాడు. అంతరించిపోతున్న సైబేరియన్, మంగోలియన్, ఎస్కిమోల భాషలను నేర్చుకున్నాడు.

రికార్డో యువకుడిగా ఉన్న రోజుల్లోనే భాషాశాస్త్రాన్ని అవపాసన పట్టడానికి అద్భుతమైన షెడ్యూలు వేసుకున్నాడు. ప్రతిరోజూ తెల్లవారుజామున 2 గంటలకు లేచి అనేక భాషల పుస్తకాలను తిరగేసేవాడు. అప్పుడు ప్రశాంతంగా ఉండటమేగాక మెదడు చురుకుగా పనిచేస్తుందనే ఆ సమయాన్ని ఎంచుకున్నానంటాడు రికార్డో. కానీ వయస్సు పెరిగే కొద్దీ షెడ్యూలు కష్టమైనందున కొంత మార్పు చేసుకున్నాడు. ప్రస్తుతం ఉదయాన్నే 5 గంటలకు లేచి విదేశీ భాషలను అధ్యయనం చేస్తున్నాడు.

అలా రష్యన్, ఉక్రెయిన్ భాషలతో ప్రారంభించిన తన వేటను ఎస్కిమో, యాకుత్, యుకగిర్, రుతుల్, ఎట్రుస్కాన్, ప్రష్యన్, బాస్క్, మంగోలియన్‌ల వంద భాషలను పట్టుదలతో నేర్చుకున్నాడు. ఆ అనుభవాలన్నింటినీ కలిపి ఒక డాక్యుమెంటరీని తయారు చేశాడు రికార్డో. తన 70 ఏళ్ల అధ్యయనంలో వెయ్యి పత్రాల దాకా వేలాది శబ్ద ఉచ్చారణలు, అనువాదాలు, వివరణలతో నింపి వేశాడు. దాదాపుగా తెలియని భాషలను ఇటాలియన్‌లోకి అనువదించుకునేవాడు. తను అధ్యయనం చేసిన పత్రాలను ఎవరైనా చూడొచ్చని రికార్డో ఆహ్వానిస్తున్నాడు. భాషలను నేర్చుకోవడంలో తన అనుభవాన్ని చెప్పమని రష్యా, బల్గేరియా దేశాలు ఆహ్వానించినా నిరాకరించాడు. అలా వెళ్లకపోవడానికి కారణాలున్నాయి. రికార్డో ఎప్పుడూ ఇటలీ దాటి బయటకి అడుగు పెట్టకపోవడం ఒక కారణమైతే, తను ఎన్నో సంవత్సరాలు చదివి గొప్పవని భావిస్తున్న, ఊహిస్తున్న విదేశీ సంస్కృతి ప్రస్తుతం అందుకు భిన్నంగా ఉంటే తనను నిరాశపరుస్తుందనే భయం మరో కారణం. రికార్డోకు ఇంగ్లీషు, జర్మన్‌లాంటి ఆధునిక భాషలు మాట్లాడటం ఇష్టం లేదు. యకుత్స్, ఈట్రుస్కాన్ భాషలు మాట్లాడం తనకొక పరీక్షే అంటాడు రికార్డో. భాషలపట్ల విస్తారమైన జ్ఞానం ఉన్నప్పటికీ తప్పిదాలు ఉంటే సిగ్గుపడకుండా ఒప్పుకుంటాడు.



-ఇహాశ్రీ

మిలింద్ సోమన్ అనగానే అందరికీ టక్కున గుర్తుచ్చేది బాలీవుడ్ నటుడని మాత్రమే. కానీ తానో గొప్ప మారథాన్ అని చాలామందికి తెలియదు. పదేళ్ల వయస్సు నుంచే స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటూ 4 చాంపియన్‌షిప్‌లను చేజిక్కించుకున్నాడు. గ్రీనథ్లాన్‌లో పాల్గొన్న మొదటిసారే లిమ్కా బుక్‌లో స్థానాన్ని సంపాదించి తన సత్తాను చాటాడు. ఇటీవల జరిగిన మహిళల పింక్‌థాన్ మారథాన్‌కు అంబాసిడర్ అయ్యాడు సోమన్.

స్టార్



ఐరన్ మారథాన్

మిలింద్ సోమన్ బాలీవుడ్ నటుడు, మోడల్ , చలనచిత్ర నిర్మాతేగాక గొప్ప మారథాన్ యోధుడు కూడా.

- సోమన్ స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో భారతీయ మరాఠీ కుటుంబంలో పుట్టాడు.
- ఏడేళ్ల వయస్సు వరకు లండన్‌లో ఉన్న సోమన్ కుటుంబం 1972లో ఇండియాకు తిరిగి వచ్చి ముంబైలోని దాదర్‌లో స్థిరపడింది.
- సోమన్ నాన్న ప్రభాకర్ సోమన్, తల్లి ఉషా సోమన్. నేత్రా, మేధా అనే ఇద్దరు అక్కలు, అనుపమా అనే చెల్లి ఉంది.
- నాన్న బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌లో అణు శాస్త్రవేత్తగా, తల్లి ఉషా ముంబైలోని విల్సన్ కాలేజీలో జీవరసాయనవేత్తగా పనిచేస్తున్నారు.
- సోమన్ తాతయ్యలు నలుగురు వైద్యులే.
- తను హైస్కూల్ విద్యను డాక్టర్ ఆంటోనియో డా సిల్వాలో, కాలేజీ విద్య దాదర్‌లోని జూనియర్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిప్లొమాను బైకులాలోని ఎం.హెచ్.సాబు సిద్దిక్ పాలిటెక్నిక్‌లో పూర్తి చేశాడు.
- ఇంజినీరింగ్ పూర్తి కాగానే సొంతంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో మోడలింగ్ వైపు అడుగులు వేశాడు.
- 1989లో మోడలింగ్ చేసి సంపాదించిన 50 వేల రూపాయల తొలి సంపాదనను చూసి ఎంతగానో మురిసిపోయాడు.



- తను మోడలింగ్ రంగంలో ప్రవేశించడానికి ముందే జాతీయ స్థాయిలో ఈతగాడు. 1984 నుండి వరుసగా నాలుగు సంవత్సరాలు నేషనల్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ టైటిల్స్‌ను కైవసం చేసుకున్నాడు.
- పదేళ్ల వయస్సులోనే స్విమ్మింగ్ పోటీల్లో మహారాష్ట్రకు ప్రాతినిధ్యం వహించాడు.
- యుక్తవయస్సులో ఉన్నప్పటి నుంచి ఫిట్‌నెస్ కోసమని ఈతపై ఎక్కువ ఆసక్తి చూపేవాడు.
- సోమన్ ఫ్రెంచ్ సహనటియైన మైలిని జాంపానైను గోవాలో 2006లో వివాహం చేసుకుని, 2009లో విడాకులు తీసుకున్నారు. వీరిద్దరూ కలిసి హిందీ చిత్రం వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్‌లో నటించారు.
- 1988 తర్వాత అనేక టీవీ సిరియల్స్‌లో చేసి 2000 సంవత్సరం నుండి రంగుల ప్రపంచం వైపు దృష్టి సారించాడు.
- తను ఆంగ్లంలోనేకాక అనేక విదేశీ భాషల్లోను నటించాడు. స్విడిష్ చిత్రం 'ఆర్న్–ది నైట్ టెంప్లర్'లో సాలాదిన్ పాత్రను పోషించాడు. 12వ శతాబ్దంలోని అరబ్బులకు, ముస్లింలకు నాయకుడైన కర్దిష్ పాత్రలో నటించాడు.
- 2010లో టీవీ రియాల్టీ షో 'కత్రోం కా ఖిలాడీ' లో పాల్గొని నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు.
- సోమన్ హిందీ, మరాఠీ, తమిళం, ఇంగ్లీషు, స్వీడిష్, భాషల్లో నటించాడు. హిందీ చిత్రాల్లోనే ఎక్కువ.
- 2015లో స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో జరిగిన ఐరన్‌మ్యాన్ చాలెంజ్‌లో పాల్గొని మొదటి ప్రయత్నంలోనే ఐరన్‌మ్యాన్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు.
- సోమన్ ట్రయథ్లాన్‌లో 15 గంటల 19 నిముషాలకు 3.8 కి.మీ.ఈత, 180.2 కి.మీ. సైకిల్ సవారీ, 42.2 కి.మీ.పరుగు తీసి తన సత్తాను చాటాడు.
- ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్‌ను పూర్తిచేసిన మొట్టమొదటి భారతీయుడు సోమన్.
- గ్రీనథ్లాన్ రేసుల్లో 30 రోజుల్లో 1500 కి.మీ. నడిచి లిమ్కాబుక్‌లో చోటు సంపాదించుకున్నాడు.
- రొమ్ము క్యాన్సర్ అవగాహన కోసం ఏర్పాటు చేసిన 'పింక్‌థాన్'కు అంబాసిడర్‌గా చేశాడు. ఇది భారతదేశంలోనే అతిపెద్ద మహిళల మారథాన్.
- పింక్‌థాన్‌లో భాగంగా ఫిబ్రవరి 26న హైదరాబాద్‌కు వచ్చాడు సోమన్.
- ట్రయథ్లాన్‌కు ముందు 86 రోజులు కఠోరమైన సాధన చేశాడు.
- ఇప్పటికీ ప్రతిరోజూ ప్రకృతి నడుమ వ్యాయామాలు, జాగింగ్, రన్నింగ్, సైక్లింగ్, ధ్యానం, స్విమ్మింగ్ తప్పనిసరిగా చేయాల్సిందే.
- ఎవరైనా బూట్లు వేసుకునే పరుగులు తీస్తారు. కానీ సోమన్ మాత్రం చెప్పులు లేకుండా పరుగులు తీయడం ప్రత్యేకత.
- కొన్ని రోజులు తన తల్లి 76 ఏళ్ల ఉషా సోమన్ చీర కట్టుకుని మరీ సోమన్‌తో పరుగు తీసేది.
- తను ఆహారం, ఆరోగ్య విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటాడు.
- నీళ్లు ఎక్కువగా తీసుకోవడమేగాక, జంక్ ఫుడ్‌లకు చాలా దూరంగా ఉంటాడు.
- బెల్లం, నెయ్యితో చేసిన ఆహార పదార్థాలు అంటే తనకెంతో ఇష్టం.



నవ్వుల్ - పువ్వుల్

నువ్వన్నదే

కొడుకు : నాన్నా నువ్వు రేపు మా స్కూల్‌కి వచ్చి మా క్లాస్ టీచర్‌ని కలవాలి??
తండ్రి : ఏం?? ఏమైంది?
కొడుకు : ఈ రోజు నన్ను తొమ్మిదార్లెంతా అని అడిగారు...యాభైనాలుగని చెప్పా... మరి ఆరు తొమ్మిదులు ఎంతవుతుందని అడిగారు.

తండ్రి : ఒరేయ్! పనికిమాలిన వెధవా, అదీ అంతే కదరా??
కొడుకు : ఔను నాన్నా 'నేనూ నువ్వన్నదే అన్నాను'..! అందుకే రమ్మన్నారు.

స్మార్ట్ ఫోన్

అప్పారావు : ఏరా డల్‌గా వున్నావు??
సుభాష్ : నా కొడుకు మూడు నెలల నుంచి స్కూల్‌కి వెళ్లడంలేదురా!
అప్పారావు : అదేంటి నాలుగు తగిలించకపోయావా వెధవకి...
సుభాష్ : తప్పు నా కొడుకుది కాదురా...
అప్పారావు : మరి ఎవరిది??



సుభాష్ : నాదే....
అప్పారావ్ : అదేంట్రా.....?!
సుభాష్ : స్మార్ట్‌ఫోన్ వుంది కదా అని మూడు నెలల క్రితం వాడు ఇంటి నుండి మిస్సయిన వార్తని వాడి ఫోటో, మా ఇంటి అడ్రస్‌తో సహా వాట్సప్, ఫేస్‌బుక్‌లో పెట్టా... అరగంటలోనే దొరికాడు.
అప్పారావు : మరి ఇంకేంటి ప్రాబ్లమ్..
ఆ మెసేజ్ ఇప్పటికీ ఎవడో ఒకడికి ఫార్వర్డ్ అవుతోంది. వీడు ఇంటి నుంచి స్కూల్‌కి వెళ్లేలోపు ఎవరో ఒకరు పట్టుకుని వాళ్లింట్లో పడేసి నాకు కాల్ చేస్తున్నారా బాబూ......
అప్పారావు : ఆ......

కిసుక్కు

భార్య : ఎక్కడికి వెళుతున్నారు?
భర్త : ఆత్మహత్య చేసుకోడానికి...
భార్య : ఒక సంచీ కూడా పట్టికెళ్లకూడదూ...
భర్త : అదెందుకు?
భార్య : ఒక వేళ మీ నిర్ణయం మార్చుకుంటే వచ్చేప్పుడు ఒక కేజీ టమాటాలు, అరకేజీ చింతపండు తెస్తారని.

తోడల్లుడు

చింటు : నాన్నా తోడల్లుడు అంటే ఎవరు?
తండ్రి : ఒకే కంపెనీ వల్ల నష్టపోయిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకడు!!

లెమన్ జ్యూస్

భార్య : ఏమండీ మన ఇంటికొచ్చిన గెస్ట్సుకి చల్లగా నిమ్మకాయ రసం ఇద్దామంటే ఇంట్లో నిమ్మకాయలు లేవండీ... ఇప్పుడెలా??
వెంగళప్ప : నువ్వేం టెన్షన్ పడకు...కొత్త సబ్బులో పది నిమ్మకాయల శక్తి వుందని నిన్నే యాడ్‌లో చూపించాడుగా....అదే కలిపిచ్చేయ్!!



నాకు నచ్చిన చిత్రం

ఇల్లస్ట్రేటర్ : ఓబ్రియన్ జేమ్స్

సేకర్త - పి. బాలు, గుణదల

కిసుక్కు సిత్రం



ఏం కాదు కదా..! జస్టు జోకే కదా..!

అట్టమీది కథ

మహానటి

"అదిగదిగో సావిత్రి
నటనకామె గాయత్రి
కష్టాలూ-కన్నీళ్ళు కలబోసిన చరిత్ర"
అన్నాడు ఆత్రేయ.
"ఒక సూర్యుడు-ఒక చంద్రుడు
ఒక భూమి-ఒక ఆకాశం!
ఒక సావిత్రి...ఒకే ఒక సావిత్రి"
అన్నాడు ముళ్ళపూడి వెంకటరమణ.
అటువంటి సావిత్రిని గురించి ఏం రాయగలం? ఎంత రాయగలం? ఆకాశమంత హృదయ వైశాల్యం గల సావిత్రి గురించి.. గోరంత అక్షరార్చనతో ఎలా సరిపెట్టగలం? ఆ తరం వారు మరిచిపోలేరు. ఈ తరం వారు అభిమానులవుతున్నారు. ఎన్ని తరాలైనా గుర్తునిలుపుకోవాల్సిన మహానటి. అందుకే పుస్తకాలు వస్తున్నాయి. చిత్రాలు రాబోతున్నాయి. మహానటి సావిత్రి గురించి ఈ వారం అట్టమీది కథ.

ఇమంది రామారావు

- 9010133844

గుంటూరు జిల్లాలోని చిర్రావూరు చిన్న కుగ్రామం. నిశ్శంకరరావు గురవయ్య, సుభద్రమ్మ దంపతులకు రెండవ సంతానం..సావిత్రి. మొదటి సంతానం వెంకమ్మ. తర్వాత ఆమె పేరు 'మారుతి'గా మార్చుకుంది. వెంకమ్మ పుట్టిన రెండు సంవత్సరాలకు సావిత్రి పుట్టింది. డిసెంబరు 6వ తేదీ 1935లో పుట్టింది. ఇది సాధికారిక సమాచారం. స్కూలు రికార్డు ప్రకారం జనవరి 4వ తేదీ. సావిత్రి పుట్టిన ఆరు మాసాలకే తండ్రి గురవయ్య కాలం చేశారు. సావిత్రిని ఆడి పోసుకున్నారు. నష్టజాతకురాలన్నారు. సంసారం సాగించడం కష్టం కావడంతో సుభద్రమ్మ అక్క దుర్గాంబ వెంకమ్మని దత్తత తీసుకుంది. దుర్గాంబ భర్త కొమ్మారెడ్డి వెంకట్రామయ్య చౌదరి. వీరు విజయవాడలో ఉండేవారు. మొగల్రాజపురంలో స్కూలు ఉండేది. కస్తూర్బా మెమోరియల్ స్కూలులో కొంతకాలం చదువుకుంది. చదువు తలకెక్కలేదు. అసలే సావిత్రికి తలతిక్క.. తను అనుకున్నది...ప్రాణాలకు తెగించైనా సాధించవలసిందే! అదే ఆమె బలం! అదే ఆమె బలహీనత!

విజయవాడలో శిష్టా పున్నయ్యశాస్త్రి దగ్గర కూచిపూడి నృత్యం. పులిపాక నరసింహారావు దగ్గర వోకల్-హార్మోనియం నేర్చుకుంది. ఈ సమయంలోనే మద్దలి సుశీల సహచరి అయింది. ఇద్దరూ పులిపాక వారింటికెళుతూ రిక్షాకి ఇచ్చే డబ్బులు ఖర్చుపెట్టుకొంటూ.. నవ్వుకుంటూ.. పాడుకుంటూ వెళ్ళేవారు. అదో సరదా!

పులిపాక వారి ఆధ్వర్యంలో రాధాకృష్ణ నృత్యనాటిక ప్రదర్శన జరిగింది. అందులో రాధ పాత్ర అభినయానికిగాను సావిత్రి బంగారు గొలుసు గెలుచుకుంది.

ఆ రోజుల్లో వీరన్న ఫొటో స్టూడియో అంటే తెలియని వారెవ్వరూ లేరు. వీరన్న గారు... సావిత్రిని చూసినప్పుడల్లా మురిసిపోయేవారు. మహాలక్ష్మిలా వున్నావే నిన్ను ఫొటో తీస్తే లడ్డూలా పడతావు! అంటూ కాంప్లిమెంట్ ఇస్తూ ఏడిపించేవారు. నాకు ఫొటోలు వద్దు.. నేను పెద్ద డాన్సర్నవుతాను.. అంటూ మూతి విరుచుకునేది.

ఒకసారి అరుణోదయ సంగీత నాట్యమండలి వారు... నటుడు జగ్గయ్య తెలుగులో అనువదించిన రవీంద్రనాథ్ నాటకం 'అపర్ణ' (బెంగాళీ) తెలుగులో 'బలిదానం'లో సావిత్రి నటించింది. ఆ రోజు ఆడిటోరియం సావిత్రి నటనని ప్రశంసల వర్షంలో ముంచెత్తింది. ఎప్పటికైనా నువ్వు గొప్ప నటివి అవుతావు అనేవారు. ఈ మాటంటే సావిత్రికి పడదు.

ఒకసారి 1950లో కాకినాడలో నాటక పరిషత్ జరుగుతోంది. దానికి విశిష్ట అతిథిగా పృథ్వీరాజ్ కపూర్ వచ్చాడు. ఆ నాటకం పేరు 'ఆత్మవంచన'. అందులో సావిత్రిది ప్రధాన పాత్ర. సావిత్రి అభినయం చేస్తుండగా 'పృథ్వీ' చప్పట్లు ఆగలేదు. ప్రదర్శన అయిపోయిన తర్వాత సావిత్రిని దగ్గరకు తీసుకుని నువ్వు చలన చిత్రసీమలో మకుటం లేని మహారాణివి అవుతావు...మహానటిగా నిలిచిపోతావు! అంటూ మనసారా దీవించారు.

సావిత్రిగారి పెదనాన్నకి సినిమాలంటే వ్యామోహం. అతి కష్టం మీద సావిత్రిని సినిమాల్లో నటించేందుకు ఒప్పించి చెన్నపట్నం తీసుకెళ్ళారు.

అప్పటికి కన్నాంబ, క్రిష్ణవేణి, జి.వరలక్ష్మి, భానుమతి, మాలతి, రాజకుమారిలాంటి మహానటీమణులున్నారు. సముద్రంలో నీటిచుక్క నేనేం నిలబడగలను అనుకుంది సావిత్రి. యల్.వి.ప్రసాద్ దర్శకత్వాన 'సంసారం' సినిమాలో కథానాయికగా ఎంపిక కోసం వెళ్లింది. అసలే ఛామనచాయ..మొహం జిడ్డువోడుతూ ఉంది. చూడ్డానికి సాదాసీదా పొరుగింటి ఆడపిల్లలా ఉంది. ఆమె వైపు చూడలేదు...చౌదరిగారు కాళ్ళా వేళ్ళా పడ్డారు. ఓ సన్నివేశంలో అవకాశం వచ్చింది. సావిత్రికి హీరోని చూసి 'అచ్చం నాగేశ్వరరావులా వున్నాడే!' అనేది సావిత్రి మొదట పలికిన డైలాగు.

జెమినీవాసన్‌గారు విరివిగా తమిళ, తెలుగు భాషల్లో సినిమాలు చేస్తుండేవారు. ఆ సంస్థలో మేనేజరు జెమినీ గణేశన్ సావిత్రిని బాగా ఎంకరేజ్ చేశాడు. ఫొటో సెషన్స్ ఏర్పాటు చేశాడు. నవ్వుతూ కనిపించినప్పుడల్లా సావిత్రి చిరాకు ప్రదర్శించేది. అది చూసి జెమినీ గణేష్ తెగ నవ్వుకునేవాడు. 'కాకతాళీయం' అనే నాటకంలో జెమినీతో కలిసి నటించవలసి వచ్చింది. అందులో జెమినీ నటన తేలిపోయింది. ఆ మాట చెబితే 'చాల్లేండి..నాకు నవ్వడమే చేతగాడు.. నేనేం నటించగలనూ?' మూతి ముడుచుకుంటూ అనేది. అలా వారిద్దరి మధ్య స్నేహం పెరిగింది. నిజం చెప్పాలంటే నవ్వడం చేతకాని సావిత్రి జలపాతంలా నవ్వుతూ..నవ్వుకే ఒక అందాన్ని తెచ్చి, చరిత్రలో ఎలా నిలిచిపోయింది? దటీజ్ సావిత్రి!



సావిత్రికి స్వాభిమానం ఎక్కువ. పట్టుదలకి ప్రతిరూపం. సావిత్రి చదువుకునే రోజుల్లో "నేను చదివితే క్లాసులో ఫస్టు రావాలి. అలాగే నేను నాట్యం చేయను. చేస్తే ఫస్ట్ రావాలి! ఇదే సూత్రం నటనకూ వర్తిస్తుంది కదా. నేను నటించను. నటిస్తే 'నటన'లో ఫస్ట్ రావాలి! ఇదీ ఆమె ఆలోచన. ఈ మాటలు విన్న చౌదరి 'ఇదొక పిచ్చిమాలోకం.. పగటికలలు కంటోంది' అంటూ హేళన చేసేవారు.

సావిత్రిలో పట్టుదల పెరిగింది. నవరసాల్ని తన ఆధీనంలో వుంచుకుంది. తెలుగు తమిళ భాషల మీద పట్టు సాధించింది. తన చుట్టూ వున్న ప్రపంచాన్ని చదవడం మొదలు పెట్టింది. అద్దంలో తన అభినయాన్ని తనే తీర్చిదిద్దుకొనేది. అలా ఎదిగింది. ఎల్వీప్రసాద్ 'మిస్సమ్మ', 'అప్పు చేసి పప్పు కూడు' చిత్రాల్లో హీరోయిన్ ఛాన్సు ఇచ్చాడు.

'దేవదాసు'లో పార్వతిగా...

డి.యల్. నారాయణగారు బెంగాలీ రచయిత శరత్‌బాబు రాసిన 'దేవదాసు'ను తెలుగులో తీస్తున్నాడు. నాగేశ్వరరావు హీరో షావుకారు జానకి హీరోయిన్. వేదాంతం రాఘవయ్య డైరెక్టరు. సుప్రసిద్ధ సంగీత దర్శకుడు సుబ్బురామన్ సంగీత దర్శకుడు. అయితే జానకి డేట్స్ కుదరలేదు. ఏదో సమాచార లోపం అప్పటికే ఈ సినిమా నిర్మాత ఎన్నో విమర్శలు ఎదుర్కోవడం వలన చిక్కుల్లో ఉన్నాడు. పులి మీద పుట్రలా.. డేట్స్ ప్రాబ్లమ్! దీన్ని భరించే శక్తి డి.యల్.కి లేదు. ఎవరో ఒకర్ని తీసుకురండయ్యా! ఇవతల నాగేశ్వరరావు ఇచ్చిన

ఇదీ సావిత్రి వైభవం!

అడిగిన వారికి కోరుకున్న చోట ఇల్లూ... చదువుకుంటానన్న వారికి చదువూ... గుప్తదానాలు... తెలిసిన ప్రతి ఇంటి పెళ్లికీ తన ఆత్మీయమైన వాళ్లకు ఒక వెండి బిందె, తాళిబొట్టు... పట్టుచీర... పసుపుకుంకాలూ... మూడుపువ్వులూ ఆరుకాయలుగా వెలుగొందుతోంది సావిత్రి జీవితం. జెమినీకి సినిమాలు తగ్గాయి. సావిత్రికి జెమినీతో గడిపే సమయం కుదిరేది కాదు. జెమినీకి మందు అలవాటుంది.

నిజానికి తాగుబోతుల్ని అసహ్యించుకునేది సావిత్రి. 'దేవదాసు' చిత్రం ప్రభావం తన మీద చాలా వుంది. తాగుడు మనిషి జీవితాన్ని ఏ స్థాయికి దిగజారుస్తుందో ఎంత పతనం చేస్తుందో ఆమెకు తెలుసు. తెలిసీ తెలిసీ తాగుడుకు అలవాటయ్యింది. మొదట్లో జెమినీ సావిత్రి కోసం ఎదురుచూసేవాడు. తరువాత జెమినీ ఇంటికి రావడం మానేసి పుష్పలత ఇంట్లో గడిపేవాడు. పుష్పలతకు పట్టుచిక్కింది. జెమినీ కావాలంటే ముందు పుష్పలత కోరికలు తీర్చాలి. ఆ తర్వాత జెమినీ అందు బాటులోకి వచ్చేవాడు. వేలు, లక్షలు.. ఆ రోజుల్లో ఖరీదైన కానుకలని అందించేది. అయితే ఇదే అదనుగా తీసుకున్న జెమినీ తనకు సినిమాలు లేవని చేసిన అప్పులు వడ్డీలతో లక్షలకులక్షలు పెరిగిపోయాయని, అప్పుల వాళ్లు ప్రాణం తీస్తున్నారని భారం పెంచాడు. కొంత వరకు పెదనాన్న చౌదరి కూడా డబ్బు గురించి వత్తిడి చేయడంతో ఆస్తుల్ని తెగ నమ్మాల్సి వచ్చింది.

ఈ విషయం సావిత్రికి తెలిసింది. జెమినీని నిలదీసింది. 'నాకేం తెలీదు. ఇదంతా మీ పెదనాన్న ప్రోత్సాహమే' అంటూ సమస్య మొత్తం చౌదరి మీదకి నెట్టేశాడు జెమినీ. ఈ విషయంలో సావిత్రికి చౌదరికి పెద్ద గొడవయ్యింది. తల్లితో సహా అందర్నీ ఇంట్లో నుంచి పొమ్మంది. జెమినీ ఆడింది ఆట పాడింది పాట అయిపోయింది. ప్రశాంతమైన జీవితం గడుపు దామని కోరుకున్నా సావిత్రి జీవితం అశాంతిమయం అయిపోయింది. కళ్ల ముందరే ఒక పక్క స్వర్గం. మరోపక్క మనశ్శాంతి లేకుండా నరకం. ఈ మధ్య మానసికంగా నలిగిపోయి మందుకి బానిస అయ్యింది.

డేట్లు అయిపోతే ఖర్చుపెట్టిందంతా వృథా అవుతుంది అంటూ విరుచుకుపడ్డారు. అలా పరిచయమైంది సావిత్రి. 'దేవదాసు' చిత్రం అక్కినేని, సావిత్రిల జీవన గమనాన్నే మార్చేసింది. అక్కినేనికి ఎంత పేరొచ్చిందో...సావిత్రమ్మకీ అంతే పేరు వచ్చింది. అప్పటికే అగ్రనటుడైన అక్కినేనితో సరిసమానంగా నటించింది. పరిశ్రమలోని పెద్దలంతా ఉలిక్కిపడ్డారు. పేరున్న హీరోయిన్లందరూ అవాక్కయ్యారు. సావిత్రి నటన గురించి తెలుగు, తమిళ పరిశ్రమలో ప్రముఖులందరూ పదేపదే మాట్లాడుకుంటూ ప్రశంసల జల్లు కురిపించారు. 'దేవదాసు'ని నిర్మించిన అన్ని భాషా చిత్రాల కంటే తెలుగు 'దేవదాసు' నెంబర్ వన్ అంటూ రివ్యూలు రాశారు.

మాయాబజార్‌లో...

చక్రపాణి గారికి సావిత్రి నటన బాగా నచ్చింది. 'మాయాబజార్' కల్పిత కథ బలమైన పాత్రధారులు ఇద్దరూ కావాలి. ఆ ఇద్దరి వలనే సినిమా ఆడాలి. ఒకటి సావిత్రి, రెండవది ఎస్వీ రంగారావు. చక్రపాణి గారి మాటలు వమ్ము కాలేదు. ముఖ్యంగా శశిరేఖగా సావిత్రి జీవం పోసింది. వరుస విజయాలు, సావిత్రి హీరోయిన్‌గా నటించిందంటే చాలు సినిమా సూపర్ హిట్టే! ప్రొడ్యూసర్లు క్యూలు కట్టారు. వాస్తవానికి అక్కినేని, యన్.టి.ఆర్ అగ్రనటుల్నీ మించిపోయిన స్టార్‌డమ్ సంపాదించింది. సినిమాలు వెల్లువలా వచ్చిపడుతున్నాయి. డబ్బు బస్తాలతో..ఎంపీ కార్లలో వచ్చి పడుతోంది. హబీబుల్లా రోడ్ కనుచూపు మేరలో కనిపించిన స్థలాలన్ని కొనుగోలు చేసింది. నెంబరు-2, హబీబుల్లా రోడ్ సావిత్రమ్మ నివాసంగా మారింది. పదివేల గజాల స్థలంలో ఓ ప్యాలెస్ రాజమందిరంలా నిర్మించుకుంది. పదహారు కార్లు... తన కోసం చెవర్లెట్.. ఇంపాలా కార్లు.. పదహారు గదుల గెస్ట్‌రూమ్‌లూ. సావిత్రి సిబ్బంది, మేకప్‌మెన్‌లు, టచప్, కాస్ట్యూమ్స్ ఎప్పుడూ ఇరవై నాలుగు గంటలూ పనిచేస్తూనే ఉండేవారు. అచ్యుతం టైలర్..అద్భుతం..లేడీస్ డ్రస్ కుట్టాడంటే దానికి తిరుగు లేదు. దాని తర్వాత వి.యస్. గాంధీ ఆ తర్వాత బాబూరావు ఆమె పర్సనల్ కాస్ట్యూమర్స్.

రోజుకి కనీసం వందమందైనా ఆ ఇంట్లో చేతులు కడగాలి. అను నిత్యం పెళ్ళిఇల్లులా కళకళలాడుతూ ఉండేది. వచ్చిపోయే నిర్మాతలు.. శ్రేయోభిలాషులూ.. బంగారు షాపు యజమానులు, ఊటీ కొడైకెనాల్ నుండి ఎస్టేట్ హోల్డర్లూ.. రోజుకీ కొన్ని లక్షల లావాదేవీలు ఆ రోజుల్లో జరుగుతుండేవి. సినిమా నటనకు సూట్ కాదు అన్నవారు.

కూతురు చాముండేశ్వరితో



కొడుకుతో

చిత్ర నిర్మాణాలతో మొదలు

ప్రతి చిన్న విషయాన్నీ ఎంతో తీవ్రంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకునే సావిత్రి ఆవేశంలో ఎన్నో తప్పుడు నిర్ణయాలు తీసుకుంది. అందులో మొట్టమొదటిది చిత్ర నిర్మాణం. రెండవది జెమినీ గణేశన్ చేసిన అప్పులకి ష్యూరిటీ సంతకాలు మూడవది చేతికి ఎముక లేకుండా చేసిన దానధర్మాలు. నాలుగవది వాగ్దానాలు చేయడం, అవి నిలబెట్టుకోవడం కోసం పడరాని పాట్లు పడడం. ఇలా ఎన్నో రకాలుగా ఒంటరిదైపోయింది.సావిత్రి జీవితంలో మొట్టమొదటి షాక్ రాజమహల్ లాంటి నెం.11 హబీబుల్లా రోడ్ ఇల్లు. ప్రభుత్వం సీజ్ చేయడం. తర్వాత ఎక్కడుంటోందో తెలియక పోవడం. సముచితమైన సలహాయిచ్చేందుకు ఒక్కరు కూడా లేకపోవడం. ఆ సమయంలోనే సావిత్రి మీద కావాల్సినంత దుష్ప్రచారం జరగడం. అది చూసి మనసు వికలమైపోయిన సావిత్రి ప్రచారంలో వున్న వార్తల్ని నిజం చేయడానికి సాహసించడం. ఈ సమయంలోనే కొడైకెనాల్‌లో వున్న ఎస్టేట్ మీద కేసు ప్రత్యర్థులు కోర్టులో వెయ్యడం, ఆ ఎస్టేట్‌ని సీజ్ చేయడం, ఇవన్నీ ఆఘమేఘాల మీద జరిగిపోయాయి. సినిమాలు దూరమయ్యాయి. పలకరించే దిక్కులేదు. ఆనందం లేదు. వున్న ఆస్తుల్ని, షీల్డుల్నీ, పట్టుచీరలు, వెండి, బంగారు బహుమతుల్ని కరిగించుకోవడం తెలుసు. కోట్లల్లో పోయాయి. ఒక్క ఫియెట్ కారు మిగిలింది. ఆ కారు కదలదు. అన్నానగర్‌లో మారుమూల ఒక్క చిన్న సింగిల్ బెడ్‌రూమ్ ఇల్లు. ఊరికి దూరంగా విసిరివేయబడ్డట్టున్న ఇల్లు. పలకరించే దిక్కులేదు. అయినా అభిమానుల అనుబంధం తగ్గలేదు. అన్ని కష్టాల్లో తానున్నా తనకోసం వచ్చేవారికి కడుపు నిండా అన్నం పెట్టేది. దారి ఖర్చులిచ్చి పంపించేది. తన దగ్గర డబ్బులు లేకపోతే ఒక పట్టుచీర ఇచ్చి,.... అదిగో రోడ్డు మీద మార్వాడీ కొట్టు వుంటుంది. ఈ చీర ఇస్తే రెండు వేలిస్తారు. తీసుకుపో..... అనేది. అలా చేతికి ఎముక లేకుండా... అంతటి నిస్సహాయ స్థితిలోనూ సాయం చేసింది.

ఊపిరున్నంత కాలం చేయిచాచి అడిగిన వారికి కాదనలేదు.

సెకండ్ ఇన్నింగ్స్

మళ్లీ సినిమాల్లో నటించమన్నారు. పాత్రలు చిన్నవైనా ఎవరి మీదా ఆధారపడకూడదనుకుని మనసు చంపుకొని నటించింది. ఒకప్పుడు పెద్ద హీరోల స్థాయిలో ఆర్జన... కానీ ఇప్పుడు అటువంటిది షూటింగు అయిపోగానే అయిదారు వేలు చేతిలో పెట్టడం జీర్ణించుకోలేకపోయింది. ముఖ్యంగా చివరి రోజుల్లో ఇంటికి డ్రాప్ చేయడానికి కూడా బండిని కేటాయించకపోవడం భరించలేకపోయింది. పదహారు కార్లు ఏడవుండేవి ఎవరెవరు వాడుకుంటున్నారో తెలిసేది కాదు. ఏడు వారాల నగలు వుండేవి. ఏ నగ ఏ సూటుకేసులో ఉందో ఎప్పుడు పోయిందో తెలిసేది కాదు. ప్రతి రోజూ ఆ ఇంట్లో వందమందికి భోజనం... ప్రతి నాలుగు రోజులకి సరుకునలయిపోయాయంటూ చేతులు చాచే మేనేజర్లు. సావిత్రి పేరు చెప్పి నల్ల కొప్పుస్వామి బెట్టి షాప్‌లో చీరలూ.. ఉమ్మిడెయార్స్‌లో నగలు తీసుకున్న సందర్భాలు ఎన్నో.... ఇవన్నీ సావిత్రి గొంతుకు చుట్టుకున్నాయి. అయినా.... భరించలేదు అనిపించుకోకూడదనేది ఆమె ఫిలాసఫీ. అందుకోసం తన దగ్గరున్న బంగారు వెండి నగలను తెగనమ్మింది. సగానికి సగం నష్టపోయింది. అవసాన కాలంలో... సావిత్రి ఒంటరిది... సావిత్రికి ఎవరూలేరు. స్నేహితులు బంధువులూ దూరమైపోయారు. దాసదాసీ జనాలు, నౌకర్లు, చాకర్లూ దూరమయ్యారు. తను ఎంతో మందిని ఇంజినీర్లను చేసింది. ఎంతోమందిని మెడిసిన్ చదివించింది. ఎంతో మందికి పెళ్ళిళ్లు చేసింది. ఎంతో మందికి మంగళ సూత్రాలిచ్చింది. ఒకపక్క తన మెడలో కట్టిన తాళి ఎగతాళి చేస్తుంటే... బలవంతంగా చావలేక... బతకలేక... అనుక్షణం నరకం అనుభవించింది ఆ మహా నటి. 'మహానటి' అనే పదం సినిమాలకు వర్తిస్తుందే గానీ నిజజీవితంలో వర్తించలేదు. సావిత్రి నిజ జీవితంలో నటించలేదు. సావిత్రికి లోకం తెలీదు. పసిపిల్ల... పసిడి మనసు... అందుకే 'నాలాంటి జీవితం పగవారికి కూడా వద్దు' అని అనుక్షణం కోరుకునేది. సావిత్రి మరో రెండు సంవత్సరాల్లో చనిపోతుందనగా సన్మాన ప్రహసనం మొదలయ్యింది. మొదటది తెలుగులో కడమా కేటీ. శాస్త్రి . రెండవది రాజబాబు చేశారు.

తెలుగు తమిళ భాషల్లో ఏకైక మహానటి సావిత్రి అన్నారు. నట శిరోమణి అన్నారు ముందు సావిత్రి డేట్సు తీసుకోండయ్యా.. మీ సినిమాకి ఫైనాన్సు చేస్తాం అనేవారున్నారు.

సావిత్రి నటిస్తే మేం డిస్ట్రిబ్యూషన్ చేస్తాం అన్నవారున్నారు. సావిత్రి డేట్స్‌ని ముందుగా బుక్ చేసుకొనే హీరోలున్నారు. ఇది సావిత్రి జీవితంలో ఒక పార్శ్వం.

కథలో మలుపు

డబ్బు పాపిష్టిదంటారు...డబ్బు ఎక్కువయ్యే సరికి చౌదరిగారి కళ్ళు కుట్టాయి. గొడవలు మొదలయ్యాయి. సినిమాల్లో పగలంతా పని చేసుకువచ్చి రాత్రి తెల్లవార్లూ ఈ అరుపులూ తిట్లూ పడలేక.. ఒక్కోసారి షూటింగ్ స్పాట్‌లోనే ఉండిపోయేది. అదే జెమినీకి వరమయ్యింది. సావిత్రి షూటింగు జరుగుతుంటే అక్కడ జెమినీ వుండి తీరాల్సిందే! అప్పటికే జెమినీ గణేశన్‌కి భార్యగా పుష్పవల్లీ ఉంది. మరొకరూ ఉన్నారు కానీ జెమినీ, సావిత్రిని ప్రాణప్రదంగా ప్రేమిస్తున్నానన్నాడు. నువ్వు లేకపోతే నేను బతకను అన్నాడు. నీ కోసం సర్వస్వం త్యాగం చేస్తానన్నాడు. జెమినీ మంచి సెన్సాఫ్ హ్యూమర్ కలవాడు. సావిత్రికి సెన్సాఫ్ హ్యూమరున్నవారంటే చాలా ఇష్టం. ఈ నేచర్ సావిత్రిని కట్టి పడేసింది. ఆ రోజుల్లో సావిత్రిని కారులో కూర్చోబెట్టుకుని లాంగ్‌డ్రైవ్ తీసుకెళ్ళేవాడు. సావిత్రి లెఫ్ట్ హ్యాండర్..ఏ పని చేసినా ఎడం చేయి వాటంగా చేసేది. డ్రైవింగ్ కూడా ఓ సారి చెన్నై నుండి మహాబలిపురానికి లాంగ్ డ్రైవ్ పోటీ పడ్డారు. సావిత్రి సూపర్ ఫాస్ట్‌గా డ్రైవ్ చేస్తుంది. ఇలా సావిత్రి మనసుని దోచుకునే అన్ని ప్రయత్నాల్లో సఫలీకృతమయ్యాడు. జెమినీ, సావిత్రీల వివాహం ఇంట్లో తల్లికి పెదనాన్నకి తెలీకుండా జరిగిపోయింది.

చివరి రోజుల్లో .....

చివరి రోజుల్లో నటీమణులు వాణిశ్రీ, జయసుధ, జయప్రద, ప్రభ, జయచిత్ర అందరూ ఉన్నారు. అందరూ 'సావిత్రి' మహానటి అంటూ సంబోధించారు. దేవత అని కొనియాడారు. దానికి సావిత్రి సమాధానం ఆమె గుండె పొరల్లోంచి వచ్చింది.

"నన్ను మహానటి మహానటి అంటున్నారు మహానటికి వేషాలు ఇవ్వరా!. (చప్పట్లు) 'దేవత దేవత అంటున్నారు అందుకేనా ఊరి పొలిమేర్లలోకి తరిమేశారు. ఆ దేవతని సంవత్సరానికోసారైనా చూస్తారు పసుపుకుంకుమలిస్తారు పట్టుచీర పెడతారు. ఈ దేవతకి పసుపుకుంకుమలొద్దు... పట్టు చీరలొద్దు ప్రేమగా పలకరించండి! అది చాలు (సావిత్రి కన్నీళ్లు) సభలో నటులు స్టాండింగ్ ఒవేషన్..

ఇంతమంది నన్ను ఆత్మకథ రాయమంటున్నారు ఏం రాస్తాను? ఏం రాయమంటారు? నేను రాస్తే అందరి రంగులూ బయటపడతాయి. ఆ పని చెయ్యను! అయినా ఆత్మలేని మనుషుల కోసం ఆత్మకథేం రాయను! సావిత్రి పోతుంది. నటి సావిత్రి బతుకుతుంది? అన్నప్పుడు 'అవును మహానటి సావిత్రి బతుకుతుంది." సినిమా వున్నంత వరకూ తెలుగు తమిళ సినిమా బతికినంతవరకూ అందరూ చప్పట్లు.. రెండు సంవత్సరాల్లో మరణించింది సావిత్రి. సావిత్రి తదనంతరం ఆస్తులు, ఎస్టేట్స్ గొడవలు క్లియరవ్వడం విశేషం! సావిత్రి జీవితం ఓ అద్భుతం! సావిత్రి నటన అనితర సాధ్యం! ఆ నాటికీ... ఈ నాటికీ.. ఏనాటికీ ఒకే ఒక మహానటి సావిత్రి.

✦

ముక్కుతో ఊదేస్తాడు

వింత లోకం

ఏకధాటిగా పదిపన్నెండు బెలూన్‌లని మీరెప్పుడైనా ఊదారా....ఇంకేమైనా ఉందా బుగ్గలు నెప్పెట్టేవూ అంటారా... అయితే మీరు టాగ్ జున్‌హాయ్(44)ని అభినందించాల్సిందే....ఎందుకంటే... హువాన్‌చెంగ్ పార్క్‌లో ఇటీవలే ఒక స్టంట్‌ని ప్రదర్శించాడు. ఇంటర్‌నెట్‌లో హల్‌చల్ చేస్తున్న ఆ వీడియో ఇప్పుడు తనకి ప్రపంచ గుర్తింపుని కూడా తెచ్చిపెట్టింది. తను సేసిస పనికి అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఇంతకీ టాంగ్ చేసిన పనేంటంటే ఒక పెద్ద టైర్‌లోకి గాలి నిపేయడం. అందులో పెద్ద వింతేముంది అది మేంకూడా చేస్తాంలే అనుకుంటే పొరబడినట్టే. టాంగ్ ఆ టైర్‌లోకి గాలి నింపింది నోటితోకాదు ముక్కుతో.... అలా చేయడం తనకు మాత్రమే సాధ్యపడుతుందని తేల్చిచెప్పేందుకు తను ఆ సాహసం చేసినప్పుడు అక్కడ గుమిగూడిన వారిని తనలా గాలి ఊదే ప్రయత్నం చేయమని సవాల్ విసిరాడు. అయితే ఆక్కడ ఎవ్వరూ ఆ సవాల్‌ని పూర్తిచేయలేకపోయారు. మీరు మాత్రం అలా ప్రయత్నించకండి. ఎందుకంటే టాంగ్‌కి ఇలా చేయడానికి పది సంవత్సరాలు సాధన చేశాడు మరి. చిన్నతనంలో ఓ కుంగ్ ఫు మాస్టర్ ఇలా చేయడం చూసి ప్రభావితుడయ్యాడట టాంగ్.. అప్పటి నుంచి ముక్కుతో గాలి నింపే ప్రయత్నంతోపాటు ఊపిరితిత్తుల ధృడత్వంలోనూ పట్టుసాధించడంతో ఇది సాధ్యపడిందట.

ఇది ఫీబో

గర్భస్థ శిశువు తొలి కదలికల్ని తెలుసుకునేది అమ్మ మాత్రమే. అయితే ఇప్పుడు తల్లితోపాటు తన చిన్నారి కదలికల్ని నాన్న కూడ వెంటనే తెలుసుకో వచ్చు అంటోంది ఒక డ్యానిష్ కంపెనీ..... అదెలా అనేగా మీ సందేహం. అమ్మకడుపులో వున్న శిశువు ప్రతి కదలికనీ తండ్రి సైతం అనుభూతి చెందేలా ఓ పరికరాన్ని తయారు చేసింది సదరు సంస్థ. అమ్మ బొజ్జపై ఒక పట్టీని అమర్చి దాన్ని ఒక పరికరానికి అనుసంధానం చేస్తారు. బ్రేస్‌లెట్, రిస్ట్ వాచ్‌లని పోలుండే ఆ బేబీ కిక్ పరికరం ధరిస్తే ద్వారా పలు దశల్లో పిండం ప్రతి కదలికలోని ఆనందాన్ని తండ్రి కూడా అనూభూతి చెందొచ్చు. ఇటీవలే దానికి ఫిబో అని పేరుపెట్టారు. నిర్మాణ దశని పూర్తి చేసుకున్న ఫీబీ ధర మాత్రం సదరు



కంపెనీ ఇంకా ప్రకటించలేదు. అయితే ఫీబోను అద్దెకు కూడా పొందవచ్చని సంస్థ ప్రకటించడంతో ధర కాస్త ఎక్కువే వుంటుందనేది కొందరి అభిప్రాయం. ఇంతకీ ఫిబో పూర్తిగా మార్కెట్‌లో అందుబాటులోకొచ్చేది మాత్రం 2018లోనట.

నూలుతో కోట్ల సంపాదన

ఉత్తర చైనాలోని దోంగాజుయ్యాంగ్స్ ప్రాంతంలో జనాభా రెండు వేలకి మించదు. ప్రజలకి ఒక పూట భోజనానికి సరిపడ పంట పండించడం కూడా ఆక్కడ కష్టమే. నిన్న మొన్నటి దాకా అలాంటి కటిక పేదరికాన్ని అనుభవించిన వీళ్లంతా ఇప్పుడు మిలియనీర్లుగా మారిపోయారు. ఇంతకీ వీళ్లనలా మార్చింది ఒక ఆన్‌లైన్ స్టోర్ అంటే నమ్మగలరా.....నిజమేనండీ కటిక పేదరికంలో ఉన్న ఈ ప్రాంతానికి చెందిన ఒకతనికి ఓ ఐడియా తట్టింది. అదేంటంటే ఆన్‌లైన్ ద్వారా నూలు అమ్మకాన్ని చేయడం. వెంటనే టబావ్ పేరుతో ఒక ఆన్‌లైన్ స్టోర్‌ని



ప్రారంభించాడతను. ఈ స్టోర్ సక్సెస్ అవ్వడమే కాదు మూడు నెలల్లో ఏకంగా 2,900 డాలర్ల లాభాన్ని తెచ్చిపెట్టింది. స్టోర్‌లో పనిచేసే వారి నెలజీతం ఎంతో తెలుసా అక్షరాలా 330 డాలర్లు. తక్కువ కాలంలోనే కోట్లు గడించిన ఆ వ్యాపారం గురించి ఊరంతా పాకేసింది. ఇక తమకీ ఆ ఆన్‌లైన్ వ్యాపారం గురించి చెప్పమంటూ మిగిలిన గ్రామస్తులూ కోరడంతో వారికి శిక్షణ ఇచ్చాడట టబావ్ యజమాని. అలా మరికొందరు గ్రామస్తులు ప్రారంభించిన ఆన్‌లైన్ ధారం పోగుల వ్యాపారం ఊపందుకోవడంతో ఇక తమ బీడుబారిన పొలాలని అమ్మేసి ఆన్‌లైన్ స్టోర్స్‌ని ప్రారంభించే పనిలో పడ్డారట గ్రామస్తులందరూ.



పంటి విలుకాడు

ఒక ప్రమాదంలో అభిషేక్ కుడిచేయి చచ్చుబడింది. అక్కడితో తన బంగారు భవిష్యత్తు ముగిసిందనుకున్నారందరూ. జీవితం తనకి చేదు అనుభవాలే ఇచ్చినా... తను మాత్రం చతికలపడలేదు.. లక్ష్యం దిశగా పరుగు మొదలు పెట్టాడు. దానికి శరీరం సహకరించలేదు. అలా అని తన ప్రయత్నం ఆగలేదు. పంటితో విల్లుని పట్టుకున్నాడు. అలా జాతీయ అంతర్జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొన్నాడు. పారాలింపిక్స్‌లోకి ప్రవేశించి తన సత్తా చాటుకున్నాడు. తొలి టీత్ ఆర్చర్‌గా పేరు గడించిన అభిషేక్ సునిత్ తవారే ఆర్చరీ ప్రస్థానం గురించి ఈ వారం మీ కోసం...

నాగపూర్‌లోని ఒక పేద కుటుంబంలో జన్మించాడు అభిషేక్. తండ్రి సునీల్ తవారే ఒక ప్రైవేట్ రవాణా కంపెనీలో కూలీగా పనిచేసేవాడు. అప్పుడు సంవత్సరం కూడా నిండని అభిషేక్‌కి తీవ్ర జ్వరం సోకడంతో నాగపూర్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అభిషేక్ కుడి చేతిపై డాక్టర్ వేసిన సూది మందు ద్వారా జ్వరం రెండు రోజుల్లో తగ్గుముఖం పట్టినా ఆ మందు వికటించింది. కొద్దికాలంలోనే కుడి చేయి పూర్తిగా చచ్చుబడింది. దీనిపై తన తల్లిదండ్రులు డాక్టర్లని ప్రశ్నించలేకపోయారు. ఇరుగుపొరుగు అభిషేక్‌ని చూసి ఇక ఇంటికే పరిమితమవుతాడనుకున్నారు. అలా జరగడం అభిషేక్ తల్లిదండ్రులకి ఏ మాత్రం ఇష్టంలేదు. అందరు పిల్లల్లాగే అభిషేక్ పెరగాలనుకున్నారు. అతన్ని బడికి పంపారు. బడి చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకున్న అభిషేక్‌ని ఆ దిశగా ప్రోత్సహించారు. వాళ్ల ప్రోత్సాహంతో అథ్లెటిక్స్‌లోకి ప్రవేశించిన అభిషేక్ ఎనిమిదో తరగతిలోనే 5000 మీ. పరుగు పోటీల్లో పతకాలు సాధించాడు.

సాధారణ క్రీడాకారుల విభాగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు గెలుచుకున్నాడు. ఆ విజయం అభిషేక్‌కి క్రీడలపై మరింత ఆసక్తిని పెంచింది. పదో తరగతిలో ప్రముఖ కోచ్ రాజేంద్ర ఖండల్‌ని కలుసుకున్న అభిషేక్ జీవితం మలుపు తిరిగింది. ఆదర్శ విద్యామందిర్ స్పోర్ట్స్ క్లబ్‌ని నడుపుతున్న రాజేంద్ర ద్వారా క్రాస్ కంట్రీ పరుగు పోటీల గురించి తెలుసుకుని మహారాష్ట్రా స్టేట్ ప్యారాలింపిక్స్ అసోసియేషన్(ఎమ్ఎస్‌పిఎ)లో తొమ్మిదేళ్ల పాటు ప్యారా అథ్లెట్‌గా కొనసాగాడు. అయితే 2010లో



మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్న అభిషేక్ మోకాలుకి గాయాలయ్యాయి. ఆపరేషన్ తర్వాత ఆటల్లో పాల్గొనవద్దని డాక్టర్లు వారించారు. క్రీడలపై ఆసక్తితో జాతీయ స్థాయి రిలే పరుగు పోటీల్లో పాల్గొని కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. అయితే గాయం మరింత ఎక్కువవడంతో దాదాపు రెండేళ్ల పాటు క్రీడలకి దూరమయ్యాడు. త్వరలో తిరిగి పరుగు ప్రారంభించాలనుకున్న అభిషేక్ ఒక చేదు వార్త అందుకున్నాడు. పూర్తిగా పరుగు ఆపేయాలంటూ డాక్టర్లు సూచించారు.

తమ్ముడు... తల్లి... విల్లు

ఆ సమయంలో తమ్ముడు సందీప్ గవాయ్ ప్రోత్సాహంతో ఆర్చరీలోకి అడుగుపెట్టాడు అభిషేక్. అప్పటి వరకు తను కొనసాగిన పరుగు పందాలేవీ తనకి కుడిచేయి అవసరాన్ని ముందుకు తేలేదు. పరిస్థితులకి కుంగిపోకుండా సమస్యని అధిగమించే ప్రయత్నాలు మొదలు పెట్టాడు. కుడిచేయిని కోల్పోయి ఆర్చరీలో కొనసాగుతున్న క్రీడాకారుల్లో విల్లుని పట్టేందుకు భుజాలు తోడ్పడతాయి. అయితే అభిషేక్ విషయం అలా కాదు. కుడి చెయ్యితోపాటు భుజం కూడా పూర్తిగా బలహీనంగా వుండడం తనకి పెద్ద సవాలయ్యింది. క్రీడలో కొనసాగాలనే తపనతో పంటితో వింటిని లాగే సాధన మొదలు పెట్టాడు. ఆ సాధనలో సఫలమవ్వడమేకాదు మన దేశంలో జరిగిన వివిధ ఆర్చరీ పోటీల్లో పతకాలు సాధించడంతోపాటు భారతీయ తొలి టీత్ ఆర్చర్‌గా రికార్డుని సొంతం చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సొంతగానే సాధన ప్రారంభించాడు. సొంత విల్లు లేకపోవడంతో సాధన కష్టమైందతనికి. తల్లి నగని తాకట్టు పెట్టడం ద్వారా వచ్చిన డబ్బుతో ఒక సాధారణ విల్లుని కొని సాధన ప్రారంభించాడు తవారే.

గతేడాది జులైలో ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఎఐ) పారా ఆర్చరీ ప్రపంచస్థాయి పోటీలని నిర్వహించింది. ఆ పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి అందర్నీ ఆకట్టుకున్నాడు అభిషేక్ తవారే. ఆ తర్వాత ఆగస్టులో బరోడాలో విభిన్న ప్రతిభావంతులు (వికలాంగులు) కోసం ఆలిండియా ఆర్చరీ మీట్ పోటీల్లో రజత పతకం గెలుచుకున్నాడు. ఇక సెప్టెంబర్ నెలలో నాగపూర్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి మీట్‌కి ఎంపికవడంతోపాటు షోలాపూర్‌లో జరిగిన జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో 27వ స్థానాన్ని దక్కించుకున్నాడు. నాగపూర్‌లో నిర్వహించిన ఇంటర్ కాలేజ్ మీట్ పోటీల్లో 720 పాయింట్లకిగాను 637 పాయింట్లు గెలుచుకున్నాడు. అదే నెలలో పాటియాలాలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ ఆర్చరీ మీట్‌లో 69వ స్థానంలో నిలిచాడు అభిషేక్. తను సాధించిన ఈ విజయాలన్నీ తన పంటి బిగువుతోనే అనేది అందర్నీ ఆశ్చర్యపరిచే విషయం. 2020లో టోక్యోలో జరగనున్న ప్యారాలింపిక్స్ కోసం కృషిచేస్తున్న అభిషేక్ ఆశయం నెరవేరాలనీ కోరుకుందాం.

కొన్నంతే... కథల కన్నా కల్పనల కన్నా అతీతంగా ఉంటాం
జరుగుతాయంటే విచిత్రంగా ఉంటుంది. విచిత్రమని ఉ
సల్పనివ్వనంత ఉద్విగ్నత ఉంది ఈ కథలో. ముఖ్యంగా ఈ
ప్రయాణాలు మలుపు తిప్పేస్తాయి. కొన్ని యాత్రలు జీవితం
ప్రయాణం.. ఒక జీవిత యాత్ర... మధ్యే తిరుగుతుం
ప్రేమ కథంతా. ఓ విమానం దిగి వచ్చి ఓ సైకిల్
ఉంటుందో.. చార్లొట్ మహానందియా ప్రేమకు
ఉంటుంది. వంద కిలోమీటర్లుండే పక్క ఊరికీ
వేల మైళ్ల సుదూరానికి సైకిల్ తొక్కిన మ
మీరూ కాలంతో వెనక్కు

కథే ని

ఆది 1975 డిసెంబర్ 17. దేశానికి ఎంతో మంది విదేశీ పర్యాటకులు వస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ గురించి మరిక చెప్పేదేముంది విదేశీ పక్షులన్నీ ఎగిరొచ్చి వాలినట్టుంటుంది. అవును మరి విమానాల్లో ఎగిరొస్తారని గొప్పగా చెప్పుకుంటారు వీధిలోని అంగడివారు. అలా ఆశ్చర్యపోయేవాళ్లలో ప్రద్యుమ్న మహానందియా (పి.కే.) (28) కూడా ఒకరు. వీధి కళాకారుడిగా పొట్ట నింపుకుంటున్నాడు. కేవలం పది రూపాయలకే... కేవలం కేవలం పదే నిమిషాల్లో పొట్రెయిట్ స్కెచ్ వేసేస్తానని చిన్న స్టాండ్‌కు తగిలించి ఎదురు చూస్తున్నాడు. ఇలా వీధి మూలన ఎదురు చూపులన్నీ కూడా నాలుగు గింజల కోసం గిలగిలలాడే పేదరికానిది. ఇందిరాగాంధీ పొట్రెయిట్‌తో ఫేమస్ అయ్యి.. గ్యాలరీల్లో కొలువుదీరాల్సిన తన కళకు ఆ దుస్థితి పట్టేందుకు కారణం సామాజిక నేపథ్యం. పి.కె. మహానందియాది నిమ్నకులం. చేనేత కుటుంబం. ఒడిశాలోని ఆత్మాల్లిక్ గ్రామం. చిన్నప్పుడు తీవ్ర కుల వివక్ష ఎదుర్కొన్నాడు. బడిలో వేధింపులు తట్టుకోలేకపోయాడు. అప్పుడు ఆ పసి మనసు మీద గాయాలు రేగకుండా ఓ అందమైన కథ చెబుతుండేది తల్లి. రెక్కల గుర్రాలు... దేవ కన్యలు.... ఇవేమీ ఉన్నాయో లేదో సరిగా మహానందియాకు గుర్తు లేదు కానీ తల్లి చెప్పే ఓ కథ మాత్రం గుండె లోతుల్లోకి వెళ్లిపోయింది. తన కోసం... మహా నందియా కోసం సుదూరాల నుంచి ఓ అందాల యువరాణి వస్తుందని, ఆమెది మంత్రముగ్ధ మయ్యేంత అద్భుత సౌందర్యమని, తన మాటల్లో సంగీతం ధ్వని స్తుందని... ఇంకా ఇంకా చెబుతూ నిన్ను హేళన చేసిన వారంతా అప్పుడు నిన్ను చూసి తడబడతారని ఆశ కల్పించింది. ఆమెది అందమైన కల్పనని పెద్దయ్యాక స్పష్టంగా అర్థమైనా ఓ విషయం మాత్రం మహానందియాను ఆ కథకు కట్టుబడేలా చేసింది. అది ఆ మేలిమిరాశికి సొంతంగా ఓ అడవి ఉంటుందని, మే నెలలో పుట్టి ఉంటుందనే డిటైల్సే. అమ్మకు ప్రకృతి అంటే ఇష్టం అందుకే అడవిని, సూర్యుడిని కలిపేసి కథ అల్లిందని నవ్వుకునేవాడు. తన సృజన, కళలు ఆమె నుంచే వచ్చాయని రూఢీ పడ్డాడు.

కల వాస్తవంగా వచ్చి కూర్చుంది

ఆ ఆలోచనలు సుడులు తిరుగుతుండగానే కళ్ల ముందు నిజంగానే ఓ అందమైన అమ్మాయి ప్రత్యక్షమైంది. ఆమె పేరు వాన్‌స్కెడ్విన్ చార్లొట్. స్నేహితులను ఓ వ్యాన్‌లో వేసుకుని 22 రోజుల్లో ఇండియా చేరుకుని సాహసయాత్ర చేస్తోంది. 'పది రూపాయలకే... పది నిమిషాల్లో... స్కెచ్' అనే బోర్డును చూస్తూ ఏదో ఆలోచిస్తోంది. అంత టాలెంట్ ఉంటే మా వూర్లో పెద్ద ఆర్టిస్ట్ అయిపోయేవారే ఇదేంటిక్కడ పది రూపాయలకే వేసిస్తానంటు న్నాడు అన్నా అనుమానమూ ఆ మోములో కనిపిస్తోంది. కానీ మహానందియా మాత్రం ఆ మోములో మరేదో భావం అస్పష్టంగా చూస్తున్నాడు. అతడికదేంటో అంతుబట్టడం లేదు. మీరు నిజంగానే పది నిమిషాల్లోనే స్కెచ్ వేస్తారా... ఏదీ చూస్తాను అంటూ టేబుల్ మీద కూర్చుంది. కానీ మహానందియా మాత్రం ఏదో భావంతో తడబడుతున్నాడు. చేతులు వణుకుతున్నాయి. వేళ్లలో కుంచె కుదరడంలేదు. అందుకే పొట్రెయిట్ ఫెయిలైంది. చార్లొట్ ఫక్కున నవ్వింది. అమ్మ నుంచి వచ్చిన కళ కదా, ఢిల్లీ ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో అందర్నీ ఆశ్చర్యపరిచిన ప్రతిభ కదా... నిరూపించుకోవాలను కున్నాడు. 'మీరు ఇండియాలోనే మరికొన్ని రోజులు ఉండేటట్టు అయితే... ఎదురు చూస్తుంటాను. రేపు మీరు తప్పకుండా రండి. అప్పుడు చూద్దురు గానీ...' అనే మాటలేవో అనేస్తుండగా ఆమె నవ్వుతూనే వెళ్లిపోయింది. ఆమె నిజంగా రేపు వస్తుందా... పేరైనా అడగలేదే... ఎక్కడుందో కనుక్కోవాల్సింది.. నేనే వెళ్లి పొట్రెయిట్ వేసి ఇచ్చేవాడినే... అని తనను తానే తిట్టుకున్నాడు. అతడికి అంత శ్రమ ఇవ్వకుండానే చార్లొట్ ఫ్రెష్‌గా తయారై వచ్చేసింది. టేబుల్‌పై సర్దుకుని కూర్చుంది. మళ్లీ బోల్తా పడ్డాడు మహానందియా. మళ్లీ స్కెచ్ సరిగా రాలేదు. ఎందుకిలా జరుగుతోందని ఆలోచనలో పడ్డాడు. అప్పుడు గుర్తొచ్చింది తల్లి చెప్పిన కథ. చాన్సే లేదు. తర్వాతి రోజే అప్రయత్నంగా చార్లొట్ పేరు అడిగేశాడు. తన తల్లి చిన్నప్పుడు చెప్పిన కథ అప్పజెప్పేశాడు. అంత సర్‌ప్రైజ్ అవ్వడం చార్లొట్‌కు అంతకు ముందెన్నడూ లేదు.

నిజమే తను పుట్టింది మేలోనే.
కుటుంబాల్లో ఒకటి. బంగ్లాలేంటీ
విషయం తెలిశాక నిశ్చేష్టుడయ్యా
భయం. తనను చార్లొట్ సరదాకి
దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి
భయపడ్డాడు. తనకు ఆ వీధి మ
ఉండదేమోనని బాధపడ్డాడు. కా
మహానందియాతో ప్రేమలో పడి
అతన్ని వెదుక్కుంటూ వచ్చింది.
సొంతూరు తీసుకెళ్లమంది. ఒడిశ
చార్లొట్ విస్మయం చెందింది. గ్రా
చీరకట్టుతో వచ్చి మహానందియా
చేయడంతో ఈసారి విస్మయం
ప్రకారం పెళ్లి చేసుకున్నాడు చార్
ఆశ్చర్యపోయింది. రోజులు క్షణా
కదలకుండా అలానే ఉండిపోవా
అర్థమయ్యింది. కానీ గడియారం
రోజులు అయిపోయాయి. సొంత
కూడా మహానందియాను తీసుకె
తీసుకునేంత సమయం మిగల్లేద



ు. ఇవన్నీ ఓ జీవితంలో
దుకోడానికీ లేదు. ఊపిరి
ృమ యాత్రలో. నిజమే.. కొన్ని
ుయిపోతాయి. ఒక కాలక్షేప
ి మహానందియా, చార్లొట్
ముందు వాలిపోతే ఎలా
ుంకితమవడం కూడా అలానే
ుమానాల్లో తిరిగే చార్లొట్...
ానందియా ప్రేమయాత్రలో
ెళ్లిపోండి.

...జమైంది..!

ుది స్వీడెన్‌లోని రాయల్
అడవులు అదే వుడ్స్ ఉన్నాయి. ఆ
ు మహానందియా. కానీ ఓ
ఆట పట్టిస్తుందేమోనని. నేరుగా
ంప్లైంట్ ఇస్తుందేమో అని
ులలో కూడా నించునే అవకాశం
ు జరిగింది వేరు. చార్లొట్
ోయింది. అందుకే అన్నిసార్లు
ఈసారి ఏకంగా మహానందియా
ులోని కోణార్క్ ఆలయాన్ని చూసి
ానికి చేరారు. చార్లొట్
ంతండ్రికి కాళ్లకు నమస్కారం
.కే.ది. అక్కడే తమ ఆచారాల
ట్‌ను. ఈసారి పుట్టినూరూ
ు ఖర్చయిపోవడం... క్షణాలు
నుకోవడం అప్పుడే
ఆగదు కదా. చార్లొట్ పర్యాటక
దేశానికి తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి.
దామంటే పాస్‌పోర్ట్, వీసాల
. చార్లొట్‌కు మహానందియా
పరిస్థితి తెలుసు.

అందుకే విమాన ఖర్చులకు చేతిలో కొంత డబ్బుంచింది. మహానందియాకు ఆత్మాభిమానం ఎక్కువ. వద్దన్నాడు తానే ఎలాగోలా సంపాదించి కొన్ని రోజుల్లోనే కలుస్తానని మాటిచ్చాడు. మరి మధ్యమధ్యలో మాట్లాడుకోవాలి కదా అందుకే ఉత్తరాలు రాసుకునేవాళ్లు. ఏడాది గడిచినా విమానానికి టిక్కెట్ కొనేంత డబ్బు మహానందియా సంపాదించలేకపోయాడు.



మరేం చేయాలి..?

తన ప్రేయసి, భార్య, ప్రాణమయిన చార్లొట్ చేసిన అప్పటి సాహస యాత్ర హిప్పీ ట్రయల్ గుర్తొచ్చింది. దేశదిమ్మరుల జీవితమే కానీ కొత్త ప్రాంతాల్ని చవిచూడాలని, సాహసాలు చేయాలనే యువత మనస్తత్వమది. కానీ తనకు మోటార్ వాహనమెక్కడిది. మరేం చేయాలి. కిర్రు కిర్రుమంటూ పిల్లలు తొక్కుతూ సరదాగా తిరుగుతున్న దృశ్యం కనిపించింది. అవును సైకిల్ మీద స్వీడన్ వెళ్లలేనా అనే ఆలోచన కలిగింది. ఎంత దూరం... చాలా చాలా దూరం. తమ ఎడబాటు ఏర్పరిచిన దూరమంతా కాదుగా. ఎంత సమయం అబ్బో చాలా కాలం. తమ విరహ క్షణాలంత కాదుగా. ఇక నిర్ణయించేసుకున్నాడు. ఊరెళ్లి తనకు చెందిన వస్తువులన్నీ అమ్మేశాడు. ఓ అరవై రూపాయలు వచ్చాయి. ఓ పాత సైకిల్ కొన్నాడు. 1977 జనవరి 22న ఢిల్లీ నుంచి సైకిల్‌పై బయలుదేరాడు. గ్రాండ్ ట్రంక్ రోడ్డు గుండా అమృత్‌సర్ చేరాడు. రోజుకు 70 కి.మీ.ల ప్రయాణం. కానీ పాకిస్తాన్ గుండా సైకిల్ ప్రయాణానికి అనుమతి లేదు. ఎవరో పెద్దాయన మహానందియా కథ విని కాబూల్‌కు విమానం టికెట్టు ఇప్పించాడు. అక్కడ మళ్లీ ఓ సైకిల్ తీసుకుని ఎడారి దాటాడు. చార్లొట్ ఆలోచనలే కష్టాన్ని మరిపించాయి. కాందహార్‌లో ఓ బెల్జియన్ ఎదురుపడితే స్విట్జర్లాండ్‌లోని బోరాస్ ఎలా వెళ్లాలో మ్యాప్‌లో చూపించాలని కోరాడు. చార్లొట్ స్వీడీ అని మాత్రమే తెలుసు గానీ స్వీడీలంటే స్వీడన్ వాళ్లని తెలీదు. బెల్జియన్ రూట్ సెట్ చేశాడు. లేకుంటే.. ఎప్పటికి చేరేవాడో! ఇంకా 1500 కి.మీ.ల ప్రయాణముంది. ఇరాన్, టర్కీ దాటేశాడు. ప్రతి ఊరిలో వీరి ప్రేమ కథ తెలిసి కొందరు ఆశ్రయమిచ్చారు. కొందరు ఆతిథ్యమిచ్చారు. కొందరు డబ్బు సర్దారు. అలానే మహానందియా చేత స్కెచ్‌లు వేయించుకుని జ్ఞాపకంగా ఉంచుకున్నారు. భాషతో బంధాలకు సంబంధం లేదని అప్పుడే తెలిసింది. కళ అందరినీ, అన్నింటినీ కనెక్ట్ చేస్తుందనీ అర్థమైంది. కళ విశ్వజనీనమైన..వ్యాపితమైన భాష, భావప్రకటన. ఓ కేరాఫ్ ఫుట్‌పాత్... ఇంకా చెప్పాలంటే తనదేశంలో తనవారనుకునే వారికి తక్కువవాడిని... అంత గొప్పగా చార్లొట్ ఎలా ప్రేమించిందో ఆమె కోసం ఎందుకు సాహసం చేయొచ్చో మహానందియాకు తెలుసు. ఆమెకున్న అడవి కన్నా ఆమె ఆస్తిపాస్తుల కన్నా ఆమె చర్మం రంగు కన్నా ఆమె జాతి కన్నా ఇక తను చూసిన ప్రపంచంలో మరే ఇతర గొప్ప విషయమైనా ఆమె హృదయం మనస్తత్వం ముందు వెలవెలబోతాయనీ గ్రహించాడు. ఇంకొన్ని రోజుల్లో చార్లొట్‌ను చూస్తాననే ఆశే అతనితో ఆ సాహసాన్ని కొనసాగించింది. మే 28న యూరప్ చేరాడు. వెనీస్‌కు చేరేనాటికి ఆఫ్ఘన్‌లో పరిచయమైన ఆస్ట్రేలియన్ లిన్నియా ట్రైన్ టికెట్లు సిద్ధం చేసింది. ప్రపంచం ప్రేమ యాత్రకు సాయమొచ్చింది. ఇంకా ఆలస్యమెందుకని గోతెన్‌బర్గ్ సెంట్రల్ నుంచి ఫోన్ చేసి రైలెక్కేశాడు. అక్కడి నుంచి చార్లొట్ సొంతూరు బోరాస్ 70 కి.మీ. దూరం. అతడి కోసమే ఆమె నిరీక్షిస్తోంది. మహానందియాను అంతదూరం నుంచి చూస్తునే పరుగున ఎదురెళ్లి కౌగిలించుకుంది. 16 నెలల ఎడబాటు వారిది. ఏం మాట్లాడుకో లేదు. ఇద్దరూ కలసి చాలా సేపు నడుస్తూ ఓ ప్రయాణమే చేశారు. కల-ఊహ-వాస్తవాలకు సన్నని రేఖ అప్పుడే కలిసిపోయిన ట్లైంది. జాతి, సంస్కృతి, హోదా, తరగతి, ప్రాంతం, భాష ఇలా ఎన్నో విషయాలు వారి ప్రేమకు పర్వతంలా అడ్డుపడ్డాయి. ప్రేయసి కోసం ఖండాలు దాటెళ్లినోడికి అదో అడ్డా..! అందునా తనతో అంత సాహసం చేయించిన చార్లొట్ తోడుగా ఉంటే అదసలు ఆటంకమేనా. 1979లో మళ్లీ పెళ్లిచేసుకున్నారు... మరోసారి గెలిచేశారు. చార్లొట్ మహానందియాకు అక్కడి విషయాలన్నింటినీ దగ్గరుండి నేర్పింది. మహానందియాకు తన తల్లి గుర్తొచ్చింది. చిన్నప్పుడు ఆమె... ఇప్పుడు చార్లొట్ ధైర్యానిచ్చారు. వారికి ఇద్దరు పిల్లలు. ఎమెలీ (31) టెక్స్‌టైల్స్ ఎకనమిస్ట్, కార్ల్ సిద్ధార్థ (28) హెలికాప్టర్ పైలట్‌గా స్థిరపడ్డారు. అంతకు ముందే మహానందియా ఆర్ట్ టీచర్‌గా నిలదొక్కుకునేలా చార్లొట్ కృషి చేసింది. ప్రఖ్యాత ఆర్ట్ గేలరీల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేసింది. అప్పటికీ మహానందియా కళ బరువు, విలువ బాగా తెలిసింది ప్రపంచానికి. ఆమె సంగీత రంగానికి అంకితమైంది. ఆ ఇంట్లో ఆ రాగాలు, అనురాగాలు కొనసాగుతూనే ఉంటాయి. మహానందియా సైకిల్ ప్రయాణాలు కూడా. ఎందుకంటే స్వీడెన్‌వాసుల్లా ఆ కుటుంబానికి సైకిల్ తొక్కడమంటే మహా సరదా. వీరి ప్రేమ కథ, సైకిల్ యాత్రలతో జె.ఆండర్సన్ అనే రచయిత నుంచి ఓ పుస్తకం కూడా వచ్చింది. స్వీడెన్ ప్రభుత్వం వీరి ప్రేమ కథపై డాక్యుమెంటరీలు తీసింది. కళకు గ్యాలరీలను కట్టింది. యూనిసెఫ్ అతడి పెయింటింగ్‌లను గ్రీటింగ్ కార్డుల్లో వాడింది. ఒడిశా తమ తరపు మనిషిగా స్వీడెన్‌కు సాంస్కృతిక అంబాసిడర్‌ను చేసింది. గౌరవ డాక్టరేట్‌ను ఇచ్చింది. వీటన్నింటి కన్నా పీ.కే.కు లోట్టె చిందించే ఓ చిరునవ్వు చాలా ఎక్కువేమో..!

- అజయ్ కుమార్ వారాల

నిదురోదామంటే ..!

మబ్బుల మెట్ల మీద
సందర్భాల్ని మోసుకు తిరిగే
రాబందులు

రాళ్ళ పగుళ్లలో రక్తాలు
పలుకుతుంటే
జారిపడిన నిర్వాసితుడు

ఎటు వొత్తిగిలినా
చీకటి కలలు ముంచుతుంటే
పూయాల్సిన స్వప్నాలు
రాలిపోతున్నాయి

కాలం సంచుల్ని
వొంపి చూస్తే
బలహీనుడు చతికిలబడ్డ
రూపాలు దొర్లుతుంటాయి

పచ్చని పొలాల్ని
ఊదే చూపులు
అవకాశవాద సామ్రాజ్య వాదులు
చెమ్మగిల్లిన చూపుల మీద
పిడుగుల్ని కురిపిస్తూ
ఆయుష్షుని శాసిస్తున్నారు

నిదురోదామంటే
పడుకున్న నేల కదులుతోంది

కుదురు జీవితం
శూన్యానికి వేలాడుతోంది

- గవిడి శ్రీనివాస్
07019278368

కవిత్వం

బంగారు తల్లి



ఆ అడుగుల సవ్వడికి తూరుపు తొలిపొద్దు నిద్రలేస్తుంది
ఆ గాజుల గలగలలకు వంటగది ఒళ్లు విరుచుకుంటుంది
ఆ వేళ్లు వాకిలికి స్నానం చేయించి ముగ్గుతో ముస్తాబుచేస్తాయి
ఆ చూపుల్లో వెచ్చదనాన్ని కాచుకుని ఉదయిస్తాడు సూరీడు
నవ్వే పెదాల మధ్య నుంచి పక్షులన్నీ గూళ్లు వదులుతాయి
శబ్దాలు, నిశ్శబ్దాల మధ్య సాయంత్రం వస్తుంది
కురుల నల్లదనాన్ని ఆకాశం అప్పు తీసుకుంటుంది
తెల్లని చెక్కిళ్ల చాటు నుంచి చంద్రుడు ప్రకాశిస్తాడు
ఆ ఉనికి పేరు అమ్మ

మనసంతా కళ్లల్లో కనిపిస్తుంది
చదువంతా ఆ మాటల్లో వినిపిస్తుంది
ముందు తరానికి దిక్సూచిగా
వెనుకటి తరానికి ఆర్తిగా నిలుస్తుంది
పిలిస్తే పలికే పేరే తోబుట్టువు

ఖాళీ మనసును ప్రేమతో నింపి
వెచ్చని ఒడిలో అచ్చమైన తెలుగుదనమై నిండిపోతుంది
చీకట్లో చిరుదీపాన్ని వెలిగించి
పరిపూర్ణం చేస్తుంది
ప్రేమికురాలిగా, స్నేహితురాలిగా మార్గం వేస్తుంది

మహారాణిలా నీ ఇంటిని ఏలుతుంది
చక్రాల్లాంటి కళ్లు తిప్పుతూ నిన్ను శాసిస్తుంది
ఇంద్రధనుస్సును ఊయలగా చేసి ఊగుతుంది
ఏరుకోవాలే కాని నవ్వితే నవరత్నాలు కురిపించే
బంగారుతల్లిగా నీ ఇల్లంతా వెన్నెల కురిపిస్తుంది

- అమూల్యాచందు కప్పగంతు
9059824800

తెలుసా



నీరు.. నీరు.. నీరు...

- చంద్రునిపై మంచురూపంలో నీరు ఉందని చంద్రయాన్ ద్వారా తెలిసింది.
- మన శరీరం నుండి ప్రతిరోజూ రెండు కార్ట్స్ (64 ఓజజ్) నీరు చెమట రూపంలో బయటికి పోతుంది.
- అమెరికన్లు దాదాపు సగం నీటిని థర్మోఎలక్ట్రికల్ విద్యుదుత్పత్తి కోసమే ఉపయోగిస్తున్నారు.
- నలుగురు సభ్యులున్న కుటుంబ ఆహార తయారీకి రోజుకు దాదాపు 6,800 గ్యాలన్‌ల (25,700 లీటర్లు) నీరు అవసరమవుతుందని ఓ లెక్క

- నైరోబీ పట్టణ పేదలు న్యూయార్క్ కంటే 10 రెట్లు ఎక్కువ నీటి కోసం ఖర్చుపెడ్తున్నారు.
- ఆరోగ్యవంతుడైన మనిషి రోజుకి దాదాపు 3 గ్యాలన్ల (48 కప్పులు) నీటిని తాగుతాడు.
- భూగర్భ జలంగా ఒక మైలు దిగువకు నీరు ఇంకడానికి పట్టే సమయం మనిషి జీవితకాలం.
- మనిషి ఆహారం లేకుండా ఒక నెల అయినా ఉండగలడు. కానీ నీరు లేకుండా వారం కూడా ఉండలేడు.



- నీటి ప్రమాదాల వల్ల ప్రతి గంటకు 200 మంది పిల్లలు చనిపోతున్నారని ఓ నివేదిక.
- మానవ మెదడులో 70 శాతం నీరు ఉంటుంది.
- ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 80 శాతం రోగాలు నీటికి సంబంధించినవే.
- కొళాయిని పెద్ద ధారగా వదిలేయడం వల్ల పడే చిన్న నీటి తుంపర్ల వల్ల రోజుకి 75 లీటర్ల నీరు వృథా అవుతుందట.

- పటిష్ఠంగా గట్టిగా కనిపించే మనిషి ఎముకలలో 25 శాతం నీరు ఉంటుంది.
- ప్రపంచంలో ఎక్కువ మంది కనీసం 3 గంటలు నడిస్తే కానీ నీళ్ళు తాగరట.
- పుట్టిన బిడ్డ బరువులో 80 శాతం నీరే ఉంటుంది.

- ఒక కోడిగుడ్డు ఉత్పత్తికి 120 గాలన్‌ల నీరు అవసరమవుతుంది.
- ఒక కారుని తయారు చేయడానికి 1,48,000 లీటర్ల నీటిని వాడుతారు.
- ప్రతిరోజూ సూర్యుని వేడికి ట్రిలియన్ టన్నుల నీరు ఆవిరవుతుంది.



- నీటిలో ఉండే జంతువులు నేలపై ఉండే జంతువుల కన్నా 5 రెట్లు ఎక్కువగా అంతరించిపోతున్నాయి.
- కెఫెన్, ఆల్కహాల్ తీసుకునేటప్పుడు ప్రతి ఆరు ఔన్సులకు అదనంగా 10 నుంచి 12 ఔన్సుల నీళ్లు అవసరమవుతుంది.

కథ

గురువు..!

- జి.ఎల్.ఎన్.ప్రసాద్

9441450987



బస్సు దిగి ఎన్నో ఆశలతో వడివడిగా ఆర్ట్స్ కళాశాల వైపు అడుగులు వేస్తున్నాను. నేను ఊహించని మలుపులు తిరిగిన నా జీవితం, ఇప్పుడు మరో ఆసక్తికర ఘట్టాన్ని ఆవిష్కరించబోతుంది. అదేమో కాదు నాకు డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా ఉద్యోగం రావడం. అది కూడా నేను చదువుకొన్న అత్యంత ప్రతిష్ఠాత్మకమైన శత వసంతాల ఆర్ట్స్ కళాశాలలో ఉద్యోగం రావడం. ఈ కళాశాల ఈ పట్టణానికి ఒక కిరీటం లాగ కనపడుతుంది. కళాశాల సింహ ద్వారం సమీపించాను. ఇంతకుముందు ఈ ద్వారం లేదు. ఇది కళాశాలకు ఒక వడ్డాణం లాగా ఉంది. ఎంతమంది మేధావులను ఈ కళాశాల తయారు చేసిందో తలచుకొంటే, నా మనస్సు వెన్నెల గోదావరిగా మారుతుంది.. కానీ నా జిల్లాలో గోదావరి లాంటి జీవ నదులకు తావెక్కడిది? కరువు రక్కసి కోరలలో చిక్కి శల్యమై.. మండే ఎండలో కాళ్ళు.. కడుపు రెండు కాలుతుంటే, చదువుకొని నాలుగు రాళ్ళ సంపాదించి బతుకు గడవడానికి నాలుగు మెతుకులు సంపాదించుకొందామనే ఆశతో తిరుగుతున్న విద్యార్థులు నాకు కళాశాల ద్వారం నించే కనిపించారు. బయట తోపుడు బండిలో పది రూపాయలకు దొరుకుతున్న ఎగ్ రైస్‌ను అవురావురుమని తింటున్న ఆ విద్యార్థులను చూస్తుంటే, ఆకలి సాంద్రత నాకు తెలిసి వచ్చింది. వెంటనే నేను చదువుకునే రోజులు గుర్తొచ్చాయి. మిరపకాయ బజ్జీలు తిని కడుపు నింపుకున్న రామకృష్ణ గుర్తొచ్చాడు. వారాలు చేస్తూ చదువుకొన్న నాగిగాడు గుర్తొచ్చి..హృదయం బరువెక్కింది. ఇన్‌షర్టు చేస్తే చినిగిన ప్యాంటు కనపడుతుందని ప్రిన్సిపాల్ రోజూ తిడుతున్నా టక్ చేయకుండా కళాశాలకు వచ్చే ఇంకో మిత్రుడు ఆంజనేయులు కూడా స్మృతి పథంలో మెదిలాడు. వీరందరూ ఎక్కడ ఉన్నారో...ఏం చేస్తున్నారో...ఈ ఆలోచనలతో గేటు దాటి లోపలకు ప్రవేశిస్తున్న నన్ను రాసుకుంటూ ఒక పల్సర్ బైక్‌లో విద్యార్థి వేగంగా వెళ్ళిపోయాడు. నాకు ఆశ్చర్యం వేసింది. మా నాన్నగారు బ్యాంకు మేనేజర్‌గా ఉన్నప్పటికీ నేను సైకిల్‌పై కళాశాలకు వచ్చేవాడిని. విద్యార్థుల ఆర్థిక స్థాయి పెరిగినట్టు ఉంది అనుకొని ఆనందపడ్డాను. మరో అబ్బాయిని చూసాను. అతను ప్యాంటు వేసుకొన్నట్టు లేదు.. దావలో వస్తుంటే కాలికి ప్యాంటు తగులుకొన్నట్టు ఉంది. ఇంకో విద్యార్థికి చూసాను. ఒక చెవికి కమ్మ పెట్టుకొన్నాడు. నాకు చిన్నప్పటి నుంచి ఒక నమ్మకం ఏమంటే, రెండు చెవులకు కమ్మలున్నవారు స్త్రీలని.. కమ్మలు లేనివారు పురుషులని..కానీ ఈ ఒంటి చెవికి కమ్మ తగిలించుకొని కనబడ్డ వీడిని ఏ కేటగిరిలోకి చేర్చాలనో తెలియక తికమక పడ్డాను. నా మనసు నన్ను అప్పుడు నీవు వచ్చింది లింగ నిర్ధారణకు కాదని హెచ్చరించింది. ఇప్పుడు నాకు బ్రిటీష్ వారు కట్టిన పెద్ద భవనం కళాశాల ప్రాంగణంలో కనపడింది. కంకరతో కట్టిన భవనం, రంగు వెలిసిపోయింది. దానికి తెల్ల రంగు వేయాలంటే కోటి రూపాయల దాకా అవుతుందని ఎవరో కాంట్రాక్టర్ చెప్పాడట. ఒక వెయ్యి పావురాలను తెచ్చి వదిలితే వాటి రెట్టలతో అవే ఉచితంగా తెల్ల రంగు వేస్తాయి కదా అనిపించింది. నేను జంతుశాస్త్ర అధ్యాపకుడిని కదా.. అందుకే అటువంటి ఆలోచన వచ్చింది. ప్రిన్సిపాల్ గది వైపు వెళుతుంటే, కొద్దిగా భయం వేసింది. నేను చదువుకొనే రోజులలో ప్రిన్సిపాల్ గది బయట బిళ్ళ బంట్రోతు ఉండేవాడు. మూడేండ్ల నా విద్యార్థి జీవితం మా ప్రిన్సిపాల్‌ను చూడకనే గడిచిపోయింది. ఇప్పుడు అది సాధ్యం కాదు. ప్రిన్సిపాల్ గదిలో మీటింగ్ జరుగుతున్నదని. మా మిత్రుడు మొదటే చెప్పాడు.. ఇలాంటి పెద్ద కళాశాలలో గంటల కొద్దీ స్టాఫ్ మీటింగులు జరుగుతాయని..కానీ ఆ మీటింగులలో తీసుకున్న ఏ నిర్ణయాలు అమలుకావని.

గంటసేపు తరువాత ప్రిన్సిపాల్ నుంచి పిలుపు వచ్చి లోపలికి వెళ్లాను. ఆ గది చాలా పెద్దది. మన విద్యావ్యవస్థలో తరగతి గదులు మరియు ప్రిన్సిపాల్ గదులు పెద్దవవుతున్నాయి. కానీ అధ్యాపకుల మనస్సులు ఇరుకుగా తయారవుతున్నాయి. ప్రిన్సిపాల్ నాకు శుభాకాంక్షలు తెలిపి నేనిచ్చిన జాయినింగ్ రిపోర్ట్ తీసుకొన్నారు. నాకు చాలా జాగ్రత్తలు తెలిపారు. చాక్‌పీసు మరియు నల్లబోర్డులను ఉపయోగించి కాకుండా పవర్ పాయింట్ ద్వారా బోధించాలని చెప్పారు. మనం చెప్పే "పాయింట్‌లో పవర్" ఉంటే "పవర్ పాయింట్" ఎందుకో నాకు అర్థం కాలేదు. నేను ఒక కంప్యూటర్ నిరక్షరాస్యుడిని కదా మరి.

తరువాత నన్ను మిగిలిన అధ్యాపకులకు పరిచయం చేసారు. చాలా మంది సీనియర్ అధ్యాపకులు నన్ను కనీసం పట్టించుకోలేదు.

అభిజాత్యమో..ధిషణనో..అర్థం కాలేదు. ఎదుటి వ్యక్తిని గౌరవభావంతో చూసే సంస్కారం నేర్పని చదువులెందుకు? ఇంతలో నా క్లాస్‌మెట్ రామకృష్ణ కనిపించాడు. నాకు ఎగిరి గంతేసినంత పనయ్యింది. అతను ఇదే కళాశాలలో రసాయనశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్నాడట. నన్ను చూసి అతను ఎటువంటి ఉద్వేగానికి గురి కాలేదు. అంటి...అంటనట్టు కరచాలనం చేసాడు. నాకంటే మూడు సంవత్సరాలకు ముందే ఉద్యోగం రావడంతో ప్రొఫెషనలిజం తలకెక్కినట్టుంది. లేదా చిన్నప్పుడు తిన్న మిరప బజ్జీల వల్ల అసిడిటీ వచ్చి ఇంత నీరసంగా తయారయ్యాడా???? రసాయనశాస్త్రం బోధించే అధ్యాపకుడికి ఇంత నీరసం ఎందుకో నాకర్థం కాలేదు. నాగిగాడు కూడా ఇదే కళాశాలలో ఉండడం నాకు పెద్ద వింతగా తోచింది. వాడు తెలుగు బోధిస్తున్నాడు.“ it is a pleasure to see you here ” అంటూ ఆంగ్లంలో కరచాలనం చేసాడు. తెలుగు ఉపన్యాసకుడై కూడా తెలుగులో మాట్లాడకుండా ఈ తెల్ల దొర కూతలెందుకో మరి?? మా ముగ్గురిని విద్యార్థి దశలో మా అధ్యాపకులు 'ముగ్గురు మూర్ఖులు' అనేవారు. కొంతమంది తొట్టి గ్యాంగ్ అనేవారు. మరి “ త్రీ ఇడియట్స్ ” ఇప్పుడు ఇదే కళాశాలలో “ త్రీ ఇంటలిజెంట్స్ ”గా మారడం వ్యవస్థ దౌర్భాగ్యమా???....లేక మా భాగ్యమా????.

ఈ పరిచయ కార్యక్రమం అయిన తరువాత నాకు ఒక విభాగపు కోఆర్డినేటర్ ముప్పై రికార్డ్స్‌ను ఇచ్చారు. వీటిని నేను ప్రతిరోజూ రాయాలట. దానిలో టీచింగ్ డైరీ, మార్క్స్ రిజిస్టర్, సెమినార్ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్‌లు ఉన్నాయి. మా విభాగంలో ఏ కార్యక్రమం జరిగినా ఫోటో ఉండాలట. ఇన్ని రికార్డ్స్ చూసిన తరువాత నాకు వచ్చింది రికార్డు అసిస్టెంట్ ఉద్యోగమా లేక లెక్చరర్ ఉద్యోగమా అనే అయోమయం నాకు కలిగింది. కళాశాల ప్రాంగణంలో ఎక్కడ చూసినా ఏదో ఒక కార్యక్రమం గురించి ఫ్లెక్సీలు కనబడుతున్నాయి. “ప్లాస్టిక్ ను నిషేధించండి” అంటూ ఒక ఫ్లెక్సీ. ఇది రూపొందించిన అధ్యాపకుడికి ఫ్లెక్సీ ప్లాస్టిక్ కంటే కూడా హానికరమని తెలియదా అనిపించింది. చదువు చెప్పే వారిలో ఎందుకింత విపరీత పోకడ? నాకు ప్రతి అధ్యాపకుడు అపరిచితుడు సినిమాలో విక్రంలాగా కనిపిస్తున్నాడు.

ఈ తంతులన్నీ ముగిసిన తరువాత ఇక పిల్లల బోధన చూడాలి కదా!!! ప్రిన్సిపాల్ చెప్పిన పవర్ పాయింట్ నేర్చుకోవడం కోసం జెకెసి ల్యాబ్‌కు వెళ్ళాను. అక్కడున్న మెంటార్ నాకు కంప్యూటర్ గురించి ఏమి తెలియదని చెప్పగానే నన్ను పురుగును చూసినట్టు చూసాడు. ఒక వారం అతని జాలి చూపులను తట్టుకుంటూ పవర్ పాయింట్ నేర్చుకొన్నాను. ఈ అనుభవం నాకు కొత్త సత్యాలను తెలియజేసింది. పవర్ పాయింట్‌లో అధ్యాపకులు విద్యార్థులకు మూడంచెలలో బోధిస్తారు. ఆపే “ cut, copy & paste ”. అధ్యాపకులను మించిన కాపీయిస్టులు లేరనిపించింది. నా పనంతా జాతీయ సదస్సులు నిర్వహించడం, మలేరియా దినం, ఎయిడ్స్ దినం లాంటి వాటిని నిర్వహించడం, రికార్డ్స్‌ను రాయడం, ర్యాలీలు ఏర్పాటు చేయడం.. ఇదో పెద్ద సంతలాగా నాకు కనబడేది. పిల్లలకు చదువు చెప్పడం తప్ప ఒక రెండు నెలల్లో అన్నీ నేర్చుకున్నాను. పవర్ పాయింట్‌లో నన్ను మించిన పవర్‌ఫుల్ అధ్యాపకుడు లేడనిపించుకొన్నాను.

ఫేస్‌బుక్‌లో నా ఫాలోయింగ్ పది వేలు దాటింది. యు ట్యూబ్ నిండా నా దృశ్య మరియు శ్రవణ చిత్రాలే. ఒక షార్ట్ మూవీ కూడా మా శత వసంతాల కళాశాల మీద నా దర్శకత్వంలో రూపొందించాను. జిల్లాలో ఒక సెలబ్రిటీ అయిపోయాను. ఇలా ఐతే పది సంవత్సరాల లోపే ఉత్తమ అధ్యాపక అవార్డు వస్తుందేమో అనే భయం పట్టుకుంది. అందరు నన్ను నడిచే కంప్యూటర్‌గా చూస్తున్నారు. నాకు చాలా బాధగా ఉంది.. నన్ను ఎవరు మనిషిగా చూడరేం???? గురువుగా చూడరేం???? నేను గురువే గాని గూగుల్ సెర్చ్ ఇంజిన్ కాదు అని అరుస్తూ కళాశాల మైదానంలో తిరగాలనిపించింది. ఈ తతంగంలో ఎంత సిలబస్ నేను పూర్తి చేయలేదో నాకు తెలుసు... నా విద్యార్థులు అమాయకులు కాబట్టి నేను చేసిన ద్రోహం వారికి తెలియదు. వారు నన్ను గొప్పగా చూస్తున్నారు. నాకు నిజంగా వాళ్ళ కాళ్ళ మీద నన్ను క్షమించమని వేడుకొంటూ పడిపోవాలని ఉంది. ఎవరు ఇలా నన్ను తయారు చేశారు. వ్యవస్థా...లేక వ్యక్తులా???? ప్రతిరోజు నాకు కనపడే విద్యార్థుల గురించి నేను ఆలోచించకుండా, నాలుగు సంవత్సరాలకు ఒకసారి వచ్చే నాక్ అధికారుల గురించి ఆలోచించడం ఈ విద్యా వ్యవస్థలో పెద్ద లోపమా!!!!!!!! లేక శాపమా!!!! అధ్యాపక వృత్తిలోకి ప్రవేశించిన రెండు నెలలోనే నేను ఈ వ్యవస్థలో ఇమడలేనేమో అనే భయం పట్టుకొంది. నాకు ఒకటి మాత్రం తెలిసి వచ్చింది. అదేమంటే 'నా చదువు చట్ట బండలయ్యింది...నా బతుకు ఏటికి చల్లిన నీళ్ళయ్యింది....గురువు ఉద్యోగం నా మెడకు పెద్ద గుదిబండే అయ్యింది. ఏం చేద్దాం... సుదీర్ఘకాలం తరువాత వచ్చే పదవీ విరమణ కోసం వేచి చూస్తూ గడపాలి ఇక. విద్యార్థులారా నన్నూ... ఈ వ్యవస్థను క్షమిస్తూ... భరించండి.... భరిస్తూ...క్షమించండి.

బాధ్యత


చిన్న కథ

అయ్యో.. అయ్యో! దీని పొగరు తగలెయ్యా. ఎంత పని చేసిందిది? అదృష్టం తలుపు తట్టి మన ఇంట్లోకి ప్రవేశించి మనందరిలో సంతోష దీపాలు వెలిగిస్తే దీని తెలివి తక్కువ తనంతో చీకట్లను నింపేసింది. అయినా, ఆ అబ్బాయికి ఏమిటి తక్కువ రా? చక్కటి రూపం, చదువు, మంచి ఉద్యోగం ఇంకా గొప్ప సంపాదన. కోరి దీన్ని చేసుకుందామని వారు వస్తే దీని వెర్రి తెలివితేటలతో, అనవసరపు వాగుడుతో పిల్లాడి తల్లిదండ్రుల మనసు విరిచేసింది." అంటూ ఘాటుగా బామ్మ చీవాట్ల దండకం అందుకుంది. చదువుకుంటున్న పుస్తకాన్ని మూసేసి టేబుల్పై పడేసి బుంగమూతి పెట్టుకుని రుసరుస తన గదిలోకి వెళ్లి దభాలున తలుపు వేసేసుకుంది సునీత. "దీనికి మొదటి నుంచి అధిక గారం చేసి, చదువు చెప్పించి స్వేచ్ఛనిచ్చి తప్పు చేశామండి! చూశారా దాని వాటం!" అంటూ కళ్లల్లో జారబోతున్న నీటిని కొంగుతో తుడుచుకుంటూ వెక్కివెక్కి బాధపడుతోంది తల్లి.

తండ్రి దీర్ఘాలోచనలో పడ్డాడు. ఎంగేజ్మెంట్ అయిపోయింది. జాతకాలు చక్కగా కుదిరాయి. అబ్బాయి తల్లిదండ్రులు మంచి మర్యాదస్తులు, మంచి పేరున్న వారు. వారు ఇంతగా కోప్పడి సంబంధం క్యాన్సిల్ చేసుకుంటున్నామని చెప్పడానికి కారణం ఏమై ఉంటుంది? ఒకసారి వారి ఇంటికి వెళ్లి సావధానంగా మాట్లాడాలి అనుకున్నాడు తండ్రి తిరుమల రావు. ఇంతట్లో తన మిత్రుడు గణపతిరావు వచ్చాడు. "ఆ! ఏమిట్రా! ఇలా అయ్యిందిట. అసలు ఆ అబ్బాయి మీ అమ్మాయిని చాలా ఇష్టపడ్డాడు. పెద్ద సంస్థలో చక్కటి ఉద్యోగం, తల్లిదండ్రులు మంచివాళ్లు పైగా వారు నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. నేను ఓసారి వాళ్ల ఇంటికి వెళ్లి మాట్లాడి వస్తాను. నీవేమి అధైర్యపడకు.." అని నచ్చజెప్పాడు.

పెళ్లి కొడుకు ప్రసాద్ తండ్రి రాఘవయ్య రిటైర్డ్ రైల్వేమాస్టర్, తల్లి గృహిణి. ఒక యాభై సంబంధాలు చూసిన తర్వాత ఈ అమ్మాయి తెగ నచ్చేసి ఓకే చెప్పారు. ప్రసాద్ తన పెళ్లి కుదిరిన సందర్భంగా పార్టీలు ఇచ్చేశాడు కూడా. అంతా సంతోషంగా ఉన్న సమయంలో పెళ్లికూతురు మధ్యవర్తితో అడిగిన మాట.. రాఘవయ్య దంపతుల మనస్సును భంగపరిచింది. ఈ అమ్మాయి చాలా పొగరుబోతు అనే ముద్ర వేయించుకుంది.

చాలా మానసిక సంఘర్షణకు లోనయ్యి 'ఈ సంబంధం వద్దురా' అని ఫోన్ చేసి కొడుకు చెప్పేశాడు రాఘవయ్య. ప్రసాద్ మొహంలో రంగులు మారిపోయాయి. అప్పటికప్పుడు సెలవు మంజూరు చేయించుకుని ఇంటికి పయనమయ్యాడు. ఇంట్లో అడుగు పెడుతుండగానే 'అమ్మా ఏమైందీ? ఎందుకీ సంబంధం వద్దనుకుంటున్నారు." అని అడిగాడు. ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటున్నారు కానీ మాటలు లేవు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. కొంత సమయం గడిచింది. "ఏం జరిగింది నాన్నా?" అడిగాడు ప్రసాద్ నిశ్శబ్దాన్ని బద్దలుచేస్తూ. "ఆ అమ్మాయి అడిగిన మాట తెలిస్తే నువ్వు తట్టుకోలేవు." అన్నాడు తండ్రి. "ఏమిటి నాన్నా అది?" రెట్టించాడు ప్రసాద్. "నీవు ఉద్యోగం పేరిట నగరాల్లో తిరుగుతున్నావు కదా! ఏమైనా పొరపాటు పనులు చేశావేమోనని 'హెచ్ఐవీ' టెస్ట్ చేయించమని మధ్యవర్తితో చెప్పిందట.!" అంటూ తిట్లు మొదలెట్టాడు రాఘవయ్య. "హ్హహ్హ.." గొల్లున నవ్వాడు ప్రసాద్. "ఇదేనా ఆ తట్టుకోలేని మాట. ఆ అమ్మాయి గుణగణాల గూర్చి మనం వందమందితో సంప్రదించాం. తరవాతనే కదా మీరు కూడా అంగీకరించింది. నా దృష్టిలో ఆ అమ్మాయి అడిగిన ప్రశ్న ఏమాత్రం తప్పు కాదు. ఇటువంటి ప్రశ్నను ధైర్యంగా అడిగి చాలా బాధ్యతకల అమ్మాయని నిరూపించుకుంది. ఎట్టి పరిస్థితుల్లోను నేను ఈ అమ్మాయినే పెళ్లి చేసుకుంటాను." అంటూ చకచకా బయటకు వచ్చేశాడు.

ఈలోగా గణపతిరావు రాఘవయ్యగారింట్లోకి ప్రవేశించాడు. వారు పలకరించకపోయినా కల్పించుకుని "ఆ...! ఏమిటి సార్! ఎలా ఉన్నారు? అబ్బాయి వచ్చినట్టున్నాడు? అమ్మా.. చెల్లమ్మా! కుదిరితే కాస్త కాఫీ లేదంటే మంచి నీళ్లు ఇయ్యమ్మా!" అంటూ మాటలు కలిపాడు గణపతిరావు. కొడుకు ఇచ్చిన స్పందనకి ఆశ్చర్యార్థక ముద్రలో మిగిలిపోయిన రాఘవయ్య దంపతులు గణపతి రావు మాటలకు మరచిపోయిన నవ్వును ముఖానికి తగిలించుకుని సంభాషించారు. తరువాత జరగాల్సిన పనులు, సంప్రదింపులు ప్రసాద్ కల్పించుకుని చేశాడు. తన ఆరోగ్యానికి సంబంధించి అన్ని పరీక్షలు సునీత తండ్రి సమక్షంలో చేయించాడు. అన్ని విధాలా మంచి ఆరోగ్యమేనని ఫలితాలు వచ్చాయి. తిరుమలరావు కాస్త అసౌకర్యంగా కనిపించాడు. ప్రసాద్ అది గమనించి "సార్! పెళ్లికి ముందు జాతకాలు, కుటుంబ పరిస్థితులు, ఆస్తిపాస్తులు మొదలైన వివరాలు గురించి పరిశీలించడం కంటే నేటి సమాజ పరిస్థితుల దృష్ట్యా ఇటువంటి సందేహాలు నివృత్తి చేసుకోవడం చాలా అవసరం. మీరేమీ ఇబ్బందిపెట్టారని భావించకండి." అని చిరునవ్వు చిందిస్తూ చెప్పాడు. తిరుమలరావు తాను నిజంగా చాలా అదృష్టవంతుడినని ఇంత మంచి ఆలోచనాపరుడైన అల్లుడు దొరికినందుకు అని సంతోషించాడు. ఇక మీదట నాకు తెలిసిన వారెవళ్లకు పెళ్లి కుదిరినా జాతక చక్రాలు చూడటం కాదు.. ఈ రకమైన సందేహాల నివృత్తి చేసుకోవాలని సలహా ఇస్తాను అని మనసులో అనుకున్నాడు. పెళ్లంటే నూరేళ్ల పంట... సంబంధం కలుపుకోవడానికి ముందు సుఖమయజీవనం కోసం అందరూ ఇలానే చేయాలి అనుకున్నాడు. ప్రసాద్, సునీతల వివాహం సంతోషకరమైన వాతావరణంలో జరిగింది.

- చావలి శేషాద్రి సోమయాజులు
9032496575

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలుకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢ నమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒక వైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

సామాజిక జీవనాన్ని ప్రతిఫలించిన కథలు

మూడు దశాబ్దాల తర్వాత మళ్ళీ కథా ప్రపంచంలోకి అడుగుపెట్టారు శ్రీ లక్కోజు రాజాగణేష్ గారు. వీరు రచించిన "నిశ్శబ్ద ప్రతిధ్వని" కథలన్నీ ఆధునిక మానవ జీవితాన్ని ప్రతిబింబించేవే. ఈనాడు ప్రపంచీకరణ ప్రభావం వలన కులవృత్తులు నశించాయి. రైతుల ఆత్మవ్యథలు, చిట్‌ఫండ్ కంపెనీల మోసాలు, కాల్‌మనీ వ్యాపారుల దౌష్ట్యాలు ఇవన్నీ ఈ సంపుటిలోని కథా వస్తువులు.

జ్యూయలరీ షాపులు వచ్చాక బంగారపు పనివాళ్ళకు పని లేకుండా పోయింది. వీరాచారి ఒకప్పుడు చేతినిండా పనితో గౌరవంగా బతికినవాడు. కానీ పనులు లేకుండా పోయినాక, జ్యూయలరీ షాపుల చుట్టూ తిరిగి అక్కడి యజమానులతో చీదరించబడతాడు. 'విముఖం'లోని విషాద వృత్తాంతమిది.

ఇప్పుడు నగరాల్లో ఆధునిక సౌకర్యాలతో సెలూన్లు వచ్చాక మంగలి వృత్తి కూడా చిరునామా లేకుండా పోయింది. ఎసి రూములు, జుట్టు కత్తిరించడంలో ఆధునిక పద్ధతులు వచ్చాక మామూలు పనివాళ్ళకు గిరాకీ లేకుండా పోయింది. పరాధీనంలో సురేష్‌కు కులవృత్తి అంటే ఇష్టం ఉండదు. కానీ పొట్ట గడవడానికి తన స్నేహితుడి సెలూన్‌లో చేరడం, అప్పటినుంచీ వారి మధ్య ఉన్న స్నేహ బంధం అంతరించి యజమాని, పనివాళ్ల బంధం మిగలడంతో పెట్టుబడిదారీ సమాజ వికృత రూపాన్ని కళ్ళకు కట్టిస్తారు రచయిత.

మగవాడిగా పుట్టి ఆడ లక్షణాలతో బతుకుతూ, సమాజం చేత ఏవగింపబడుతూ జీవించే ఒక హిజ్రా కమలాకర్ కథ 'రెండు జన్మలు' 'నిశ్శబ్ద ప్రతిధ్వని' ఒక కురూపి కథ. రాజు ఒక అనాకారి. తనకు ప్రేమించే అమ్మాయి కోసం నిరీక్షిస్తాడు. బాహ్య సౌందర్యానికి ప్రాధాన్యమివ్వకుండా, అంత:సౌందర్యాన్ని అభిమానించిన రాణి తనకు తోడుగా వుండడంతో కథ ముగుస్తుంది.

ఎంత డబ్బున్నవాడైనా జీవితంలో ఎప్పుడోసారి అప్పు చెయ్యక తప్పదు. అప్పులున్నచోట వడ్డీ



పుస్తకం పేరు :నిశ్శబ్ద ప్రతిధ్వని
రచయిత :యల్.రాజాగణేష్,
పుటలు : 148, వెల :60/-
ప్రతులకు : యల్.రాజా గణేష్,
శ్రీ హేమసాయి ప్రచురణ, డోర్ నెం.26-47-1, చైతన్య నగర్, పాతగాజువాక,విశాఖపట్నం -530026, ఫోన్: 9247483700

వ్యాపారులు ఉంటారు. ఇటీవల కాల్‌మనీ వ్యాపారులు పెరిగిపోయారు. అప్పు తీర్చకపోతే వాళ్ళ భార్యలను వేధించడం ఎక్కువైపోయిందీ మధ్య. తనను కాటు వేయాలనుకొనే వ్యాపారిని ఉపాయంతో తప్పించుకొని అతనికే శిక్షపడేలా చేసిన 'లాస్య' కథే 'కాల్‌మనీ'

మరో మంచికథ 'మాతృభాష' ఇంగ్లీషు భాషా వ్యామోహంతో ఇప్పుడందరూ తమ పిల్లల్ని ఆంగ్ల మాధ్యమం బడుల్లోనే చేర్పిస్తున్నారు. తన పిల్లాణ్ణి బళ్ళో చేర్పించడానికి వెళ్ళిన తల్లి అక్కడ ప్రిన్సిపాలుతో ఇంగ్లీషులోనే మాట్లాడుతుంది. కానీ కింద పడిపోయినపుడు "ఓలమ్మో సచ్చిపోన్నే అని కేకలు పెడుతుంది. బాధ కలిగినపుడు మాతృభాషలోనే మాట్లాడతారు అని వాస్తవాన్ని ప్రతిబింబిస్తుందీ కథ.

ఈనాడు ఎక్కడబడితే అక్కడ కుక్కగొడుగుల్లా చిట్‌ఫండ్ కంపెనీలు అవతరిస్తూనే ఉన్నాయి. ప్రజల్లో నమ్మకం కలిగించి, కోట్లు వసూలు చేసాక బోర్డులు తిప్పేస్తున్నాయి. కష్టపడి సంపాదించిన డబ్బులు కట్టి, అవి రాక ఆత్మహత్యలు చేసుకొన్నవారు ఎందరో ఉన్నారు. మతి చలించిన వాళ్లూ ఉన్నారు. చిట్‌ఫండ్‌లో డబ్బులు కట్టి, అవి రాక మతి చలించిన వ్యక్తి కథ 'జాతిచెట్టుకు వేరు పురుగులు'.

ఒకప్పుడు ప్రాభవాన్ని అనుభవించి, ఇప్పుడు ఆదరించేవారు లేక దరిద్రాన్ని అనుభవిస్తున్న కొమ్ముదాసరులు, బుడబుక్కలోళ్ళ జీవన విషాదానికి అక్షర రూపమిచ్చిన కథలు 'రోజు గడవని రాజు' 'లింగంరాజు కోట' ఇంకా ఈ సంపుటిలో ధర్మరాజు గారి ధర్మా, ఓ కుక్క కథ, నెత్తిమీద కళ్ళు, బరువు బాధ్యతలు ఆలోచనలు రేకెత్తించే కథలు.

వ్యాపార సంస్కృతి మానవ జీవనాన్ని చిన్నాభిన్నం చేస్తున్న ఒక వేదన ఈ సంపుటిలోని కథలన్నింటిలో వెంటాడుతుంది.

- మందరపు హైమావతి

కొత్త పుస్తకాలు

నానీల లోతుపాతులపై అక్షర శోధన

సాహిత్యం ఒక నిరంతర స్రవంతి. ఇందులో మజిలీల కన్నా మలుపులే అధికం. ఎన్నో రకాల సాహితీ ప్రక్రియలకు సాహిత్యం ఒక జీవనది. కవిత్వం పద్యాల నుంచి ప్రబంధాల మీదుగా ఆటవెలదులు, తేటగీతులై భావకవిత్వపు దారుల్లో పరుగులు తీసి ముత్యాలసరాలుగా మారి, వచనకవిత్వమై సమాజాన్ని చైతన్యం వైపు నడిపించి, ఆలోచన రగిలించిన మినీ కవితగా ప్రశంసలందుకుని ఎన్నో పోకడలు పోతోంది. ఇటువంటి వాటిలో అత్యాధునిక కవితా ప్రక్రియ 'నానీ'. దీనిని 1997లో తొలిసారిగా రూపొందించింది ప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ ఎన్.గోపి. ఇరవై అక్షరాలకు తగ్గకుండా పాతిక అక్షరాలు దాటకుండా చిరు కవిత రూపంలో ఉండడమే ఈ నానీ ప్రత్యేకత. ఇటువంటి నానీలను ఎంతోమంది కవులు రాసారు. రాస్తున్నారు. ఈ నేపథ్యంలో సాహితీవేత్త, రమ్యభారతి పత్రిక సంపాదకుడు చలపాక ప్రకాష్ నానీలపై 'అత్యాధునిక కవితారూప ప్రక్రియ-నానీ' పేరుతో ఒక పరిశోధనా గ్రంథాన్ని రాసారు. నానీల రచయితగానే ఆగిపోకుండా వాటి లోతు పాతులను తరచి చూడాలనే సంకల్పంతో ఈ పరిశోధన చేసినట్లు స్పష్టమౌతోంది. మిత్రుల



పుస్తకం పేరు : అత్యాధునిక కవితారూప ప్రక్రియ-నానీ,
రచయిత : చలపాక ప్రకాష్
పేజీలు : 352, **ధర**: రూ 87/-
ప్రతులకు:అనేక -ప్రగతిశీల పుస్తక కేంద్రం డాక్టర్ నానయ్య ఆసుపత్రి ఎదురుగా, ఏలూరు రోడ్, విజయవాడ 520 002.

ప్రోత్సాహంతో కేంద్ర సాహిత్య మంత్రిత్వ శాఖ వారి ఫెలోషిప్ కోసం దరఖాస్తు చేసి వారి సహకారంతో ఈ గ్రంథాన్ని రాసారు. ఈ పుస్తకంలో మొత్తం 22 శీర్షికల్లో రచయిత 'నానీ పూర్వరంగం, అత్యాధునిక ప్రక్రియ నానీ, నానీ నిర్మాణం, కొనసాగింపు, నానీల వస్తు వైవిధ్యం, ఏక వస్తు నానీలు, వినూత్న ప్రయోగాలూ, నానీలలో సూక్తులూ, సుభాషితాలూ, వాటిలో హాస్య వ్యంగ్య చమత్కారాలు, నానీ కవయిత్రులు, ప్రసారమాధ్య మాలలో నానీలు, నానీలపై జన వాక్యాలు, వాదోపవాదాలు, కవుల రచయితల అభిప్రాయాలు, నానీసంపుటాలు, అవార్డులు, కొత్త ప్రక్రియలకు స్ఫూర్తినిచ్చిన నానీ తదితర విశేషాలతో సమగ్ర పరిశోధనాత్మక గ్రంథంగా దీనిని రూపొందించారు. ఒక విధంగా చెప్పాలంటే ఇది "నానీ సర్వస్వం". నానీలు చదివేవారు, రాసేవారు, ఇతర సాహితీ మిత్రుల్లో ఆసక్తిని, ఆలోచననీ పెంపొందించే పుస్తకమిది.

- బెండాళం క్రిష్ణారావు

ఈల భాష

పక్షుల కిలకిలరావాలు, తుమ్మెదల ఝుమ్...మ్...మ్కారాల్లోను ఏదో భాష ధ్వనిస్తోంది కదూ. ఆ భాష, యాస తెలీకున్నా మనమూ ఈలతో ఓ పాటేస్కోని ముచ్చట పడతాం. ఓ సిన్న ఈలేసి కిలకిలమంటాం. ఇందులో కూడా భాషుందని బాగా అర్థమైందేమో ఓ గ్రీకు గ్రామీణులు తమకంటూ ఓ ప్రత్యేకమైన యాసతో ఈల భాషలో సంభాషించేసుకుంటున్నారు. ఈల భాషే విడ్డూరమనుకుంటే అందులో యాసేంటి అంటే మరి టర్కీ, ఆఫ్రికా దేశాల్లోను ఇట్లాంటి ఈల పాటలు బానే వినబడుతున్నాయి.

ఈల ద్వారా భావాల్ని పలికించడంలో వాళ్లు సిద్ధహస్తులు. ఎలాంటి లిపి, మాండలికాలు లేకుండా ఈలతో ఏళ్ల తరబడి మాట్లాడుకుంటూ జీవనాన్ని కొనసాగించడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. థియేటర్లలో ఈలలేయడం తెలుసు, ఈల పాటలు పాడే వారి గురించి తెలుసు కానీ ఈలతో మాటలేంటనేగా మీ సందేహం. నిజానికి ఈలతో మాట్లాడుకునే ప్రజలున్నారనే విషయం ఎక్కువ మందికి తెలీదు. ఈల మాట గ్రామాల్లో గ్రీస్‌లోని యాంటియా ఒకటి. గ్రీస్ భాషలో స్ఫైరిజో అంటే ఈల అని అర్థం. కొండ ప్రాంతంగా వుండే యాంటియాలోని స్థానికులు ఈల మాటలతో వారికి స్ఫైరియా అనే పేరు స్థిరపడింది. ఇంతకీ వీళ్లు ఈ శబ్దాలని ఎలా అర్థం చేసుకుంటారనేగా మీ సందేహం. ఈలతో వీళ్లు చేసే ఒక్కో శబ్దం ఒక్కో పలుకుతో ముడిపడి వుంటుంది. వివిధ స్వరాల్లో పలికే శబ్దాలు ఒక్కో పదాన్ని ప్రతిబింబిస్తాయి. అలా

గ్రీస్‌లోని యాంటియా వాసుల సంభాషణలన్నీ ఈల పాటతోనే కొనసాగుతున్నాయి. ఇక్కడి చిన్నారులు ఐదారు ఏళ్లకే ఈలతో మాటలు మొదలు పెడతారని స్థానికులు ఈలేసుకుంటారు. యాంటియాతో పాటు గ్రీస్‌లోని సిమికొకి, ఇవాంజిలిస్‌మస్ ప్రాంతాల్లోనూ ఎక్కువగా ప్రజాదరణ పొందిన ఈల భాషకి సంబంధించి కొన్ని చారిత్రక అంశాలు ప్రచారంలో ఉన్నాయి. 1469లో పర్షియన్ల పాలనలో క్యారిస్టోస్ ప్రాంతంలో కొందరు గ్రీకులు వారికి బంధీలుగా వుండేవారు. పర్షియన్ సైనికులు ఆ సమయంలో ఎవరికీ అర్థమవకుండా వుండేలా ఈల పాట ద్వారా సంభాషణలు జరిపేవారు. కొన్నాళ్లకు ఖైదీలకి కూడా ఆ భాష వంటపట్టేసింది. సలామిస్ యుద్ధంలో పర్షియన్ సైనికులు ఓడిపోవడంతో బంధీలుగా వున్న గ్రీకులని వదిలేశారు. పర్షియన్‌ల చెర నుంచి విముక్తి పొందిన ఖైదీలందరూ ప్రాణభయంతో కొండ ప్రాంతంగా వుండే యాంటియాకి చేరుకున్నారు. అక్కడి ప్రజలతో పాటు నివాసాన్ని ఏర్పరుచుకున్నా ఈలపాటతోనే వాళ్లు మాట్లాడుకునేవారు. ఆ కొద్ది మంది ఖైదీల ద్వారా 2000 ఏళ్ల క్రితం అక్కడ ప్రవేశించిన ఈల భాష కొంత కాలంలోనే ప్రజాదరణతో వాడుకలోకి వచ్చింది. ఇప్పటికీ అక్కడి వృద్ధుల్లో కొనసాగుతున్న ఈలపాటని 'సిఫ్రియా'గా పిలుస్తారు.

వందల ఏళ్లుగా అక్కడ వాడుకలో వున్న ఈల సంభాషణల గురించి మొట్టమొదటగా బైట ప్రపంచానికి తెలిసింది 1968లోనే. యాంటియా గ్రామానికి అతి సమీపంగా వుండే ఒఛి పర్వత ప్రాంతంలో ఒక ప్లేన్ ప్రమాదం చోటు చేసుకోవడమే దానికి కారణం. ప్రమాద స్థలంలో పైలట్ కనపడక పోవడంతో అతని కోసం గాలింపు చర్యలని మొదలుపెట్టిన రెస్క్యూ టీమ్‌కి అక్కడ కొందరు ఈలతో పలకరించుకోవడం ఆశ్చర్యపరిచింది. అలా ఈ విషయం మీడియాకీ పాకేసింది. యాంటియా వాసుల పలకరింపులే కాదు వీరి సంభాషణలూ ఈల రూపంలోనే వుంటాయనే నిజాలు మీడియా ద్వారానే బయటపడ్డాయి. ప్రస్తుతం అక్కడ ఈలతో సంభాషణలు ఎక్కువగా వృద్ధులు మాత్రమే కొనసాగిస్తుండడంతో త్వరలో ఈల భాష ఉనికిని కోల్పోయే ప్రమాదం లేకపోలేదంటున్నారు పరిశోధకులు. యాంటియా మాదిరిగానే మరికొన్ని దేశాల్లో అక్కడక్కడా ఈల మాటలు వినిపించినా ఎక్కువగా ఈ తరహా సంభాషణలని కొనసాగిస్తున్నది మాత్రం టర్కీలోని కుస్కోయ్ వాసులేనని కొన్ని నివేదికల ద్వారా వెల్లడైంది. యూరప్‌ని ఐబీరియన్ పెనెన్సులా నుంచి వేరుచేయబడిన ప్రాంతం పైరినీస్. 3400మి ఏటవాలు కొండప్రాంతంగా వుండే పైరినీస్ స్థానికులతో పాటు, స్పెయిన్‌లోని కెనరీ దీవులు, మొరాకోలోని అట్లాస్ ప్రాంతీయుల్లో ఈ భాష వాడుకలో వుంది. ఈలపాట సంభాషణలు కొనసాగే ఈ ఐదు ప్రాంతాల్లో మరికొన్ని విషయాల్లో దగ్గరి పోలికలే ఉన్నాయి.. ఎత్తైన పర్వత ప్రాంతంలో నివాసంతో పాటు పశుపోషణ, వ్యవసాయాధారిత పనుల్లోనే వీరు కొనసాగుతున్నారు. ఉపాధి కోసం ఇక్కడ యువత ఎక్కువగా నగరాలకి తరలిపోతుండడంతో ప్రస్తుతం ఈలభాషలో సంభాషణలూ కనుమరుగవుతున్నాయి.

- శర్వాణి

దొండకాయ పులుసు

కావాల్సిన పదార్థాలు

దొండకాయలు-అర కిలో
ఉల్లిపాయ-1
ఎండుమిర్చి-4
పసుపు-చిటికెడు
కారం-1 టీ స్పూను
బెల్లం-50 గ్రాములు
చింతపండు గుజ్జు-అర కప్పు
ఉప్పు-రుచికి సరిపడా
నూనె-ఒకటిన్నర టేబుల్ స్పూను
మినప్పప్పు-టేబుల్ స్పూను
కొత్తిమీర తరుగు-1 టేబుల్ స్పూను

తయారీ విధానం

ముందుగా బాణలిలో టీ స్పూను నూనె వేడిచేసి జీలకర, మినప్పప్పుని వేగించి పెట్టుకోవాలి. వాటికి కారం, పసుపు, ఉప్పు జతచేసి పొడిచేయాలి. అందులోనే ఉల్లిపాయ ముక్కలు వేసి మెత్తగా నూరుకోవాలి. ఈ మిశ్రమాన్ని గాట్లు పెట్టుకున్న దొండకాయల్లో కూరి అరగంట పక్కనుంచాలి. బాణలిలో నూనె వేసి ఆవాలు, జీలకర, కరివేపాకు, వెల్లుల్లితో తాలింపు పెట్టి కూరిన దొండకాయల్ని వేసి మూత పెట్టి మగ్గించాలి. కాయలు సగం మెత్తబడ్డాక చింతపండు గుజ్జు, బెల్లం వేసి ఒక కప్పు నీటిని కలిపి ఉడికించాలి. దించే ముందు కొత్తిమీర తరుగు వేయాలి.

మామిడి-మునక్కాడ పులుసు

కావాల్సిన పదార్థాలు

మామిడికాయలు-2
మునక్కాడలు-4
ఉల్లిపాయలు-2
పచ్చి మిరపకాయలు-5
ఆవాలు, జీలకర-1 టీ స్పూను
కరివేపాకు-2 రెబ్బలు
వెల్లుల్లి రేకులు-4
కారం-2 టీ స్పూన్లు
ఉప్పు-తగినంత
నూనె-సరిపడా

తయారీ విధానం

మామిడికాయల్ని పెద్ద పెద్ద ముక్కలుగా కోసుకోవాలి. ములక్కాడలను కావాల్సిన సైజులో ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. ఉల్లిపాయల్ని కూడా చిన్న చిన్న ముక్కలుగా కోసుకోవాలి. తర్వాత గిన్నెలో నూనె వేడిచేసి ఆవాలు, జీలకర, కరివేపాకు, వెల్లుల్లిరేకులు వేయాలి. అందులోనే పచ్చిమిరపకాయ ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు కూడా వేసి వేయించుకోవాలి. దానికి ఉప్పు, కారం జతచేసి బాగా కలపాలి. అందులోనే ములక్కాడ ముక్కలు కూడా వేసి రెండు నిముషాలు మగ్గనివ్వాలి. తర్వాత మామిడికాయ ముక్కలు కూడా వేసి వేయించుకోవాలి. తర్వాత అందులో రెండు గ్లాసుల నీళ్ల పోసి ఓ పదినిముషాలు పులుసుని మరిగించాలి. ముక్కలు బాగా మెత్తబడ్డాక దించేయాలి.

వంకాయ పచ్చి పులుసు

కావాల్సిన పదార్థాలు

పెద్ద వంకాయ-1
ఉల్లి తరుగు-1 కప్పు
చింతపండు-నిమ్మకాయంత
పచ్చిమిర్చి తరుగు-2 టీ స్పూన్లు
బెల్లం-ఒకటిన్నర టీ స్పూన్లు
కొత్తిమీర తరుగు-అర కప్పు
నీరు-ఒకటిన్నర కప్పు
ఉప్పు-రుచికి తగినంత
తాలింపు కోసం-ఎండుమిర్చి, ఆవాలు, జీలకర, మినపప్పు, ఇంగువ, వెల్లుల్లి రేకలు, కరివేపాకు
నూనె-సరిపడా

తయారీ విధానం

ముందుగా చింతపండు నానబెట్టి రసం తీసి పెట్టుకోవాలి. గ్యాస్‌పై వేడి బాణలిలో నూనె రాసిన వంకాయను అన్ని వైపులా తిప్పుతూ కాల్చుకోవాలి. చల్లారిన తర్వాత తొక్క తీసి గుజ్జుగా నలపాలి. ఒక పాత్రలో గుజ్జుతోపాటు ఉల్లి, పచ్చిమిర్చి, బెల్లం తరుగు, చింతపండు రసం, ఉప్పువేసి అన్నీ కలిసేలా చేతితో పిసికి నీరు పోయాలి. తర్వాత దానిలో తాలింపు చేర్చి, కొత్తిమీర చల్లాలి. ఇది అన్నంతోపాటు పులగంలోకి కూడా బాగుంటుంది.

బుజ్జి స్టార్

హాయ్ ఫ్రెండ్స్! నేనొక స్టార్‌ని. ఇది నా చిన్ననాటి ఫోటో. ఇంతకీ నేనెవరో గుర్తించండి?

జ: సబ్రియా సబికు

ఏ నీడ ఎవరిది



పిల్లలూ! ఇక్కడ కొన్ని బొమ్మలు వాటికి ఎదురుగా కొన్ని నీడలు ఉన్నాయి. ఏ జంతువు నీడ ఎక్కడుందో గుర్తించి వాటిని జతచేయండి.

ఖాళీలు పూరించండి!



దారి కనిపెట్టండి

ఇక్కడ ఓ చిట్టెలుక రెస్టారెంట్‌కి వచ్చిన రెండు పిల్లులకి సర్వ్‌చేస్తోంది. అయితే అది కిచెన్ నుంచి టేబుల్ వద్దకి చేరుకునే దారి మర్చిపోయింది. ఆ దారేదో మీరే కనిపెట్టండి.



పదాలు పూరిద్దాం

ఇక్కడ కొన్ని బొమ్మలు వాటి ఇంగ్లిష్ పేర్లనుంచాం. అయితే వాటి పేర్లలో ఒక్క అక్షరం మిస్సయింది. ఆ అక్షరాన్ని కలిపేస్తే పదం పూర్తవుతుంది. బొమ్మల ఆధారంగా మిస్సయిన అక్షరాన్ని గుర్తించి ఖాళీల్లో నింపేయండే!





జ: moon, rocket, star, alien

కనిపెడదాం?

ఇక్కడ కనిపిస్తున్న ఈ వ్యక్తి ముఖంలో మరో ఇద్దరు వ్యక్తులు దాగున్నారు. వాళ్ళెక్కడున్నారో గుర్తించి సున్నా చుట్టేయండి.

చుక్కలు కలపండి



అక్రమాన్ని అడ్డుకున్నారు

తేజశ్వేత, శివాని పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్‌లో ఇంటర్ చదువుతున్నారు. మహిళలు చిన్నారుల అక్రమ రవాణా నిరోధించేందుకు కృషి చేస్తున్న మార్గ (మ్యాన్‌కైన్డ్ ఇన్ యాక్షన్ ఫర్ రూరల్ గ్రోత్) ఎన్‌జిఒ సంస్థకి వాలంటీర్లు వీరు. పాఠశాల స్థాయి విద్యార్థుల అక్రమ రవాణాని అడ్డుకునే దిశగా మార్గ నేతృత్వంలో స్టూడెంట్స్ ఎగనెస్ట్ ట్రాఫికింగ్ క్లబ్ (ఎస్‌ఎటిసి) వివిధ మారుమూల ప్రాంతాల్లో నడపబడుతోంది. ఎనిమిదో తరగతి నుండే ఎస్‌ఎటిసికి వాలంటీర్‌గా పనిచేస్తున్న తేజశ్వేతకి ఓ రోజు మార్గ నుంచి ఫోన్ వచ్చింది. నేపాల్‌లో తప్పిపోయిన ఎనిమిదేళ్ల చిన్నారి. బాలల ఆక్రమ రవాణా ముఠాకు చిక్కిందని, తనని కాపాడేందుకు తమ ప్రణాళికలో భాగమవ్వాలని కోరింది మార్గ బృందం. ఎస్‌ఎటిసి ఆవగాహన సదస్సులు, నెలవారీ కార్యక్రమాల్లో పాల్గొనడమే తప్ప బాలికల అక్రమరవాణాని అడ్డుకునేందుకు సంస్థ కార్యాచరణలో తానెప్పుడూ భాగమవ్వలేదు. ఈ టాస్క్‌లోకి ప్రవేశించేందుకు తేజ తల్లిదండ్రులు కూడా ఒప్పుకోలేదు. శివాని మాత్రం ఈ టాస్క్‌లో పనిచేసేందుకు ఒప్పుకుంది. మార్గ అందించిన ప్రేరణతో కొన్ని రోజులకే తేజ కూడా మార్గ వ్యూహరచనలో భాగమయ్యింది. నేపాల్ బాలికని కాపాడేందుకు మార్గ వాలంటీర్లు, పోలీసు సిబ్బందితో పాటు సిబిఐ రంగంలోకి దిగింది. ముందుగా ఆ చిన్నారి పేరున ఒక నకిలీ ఫేస్‌బుక్ ఎకౌంట్‌ని క్రియేట్ చేశారు. శివాని, తేజ తన మిత్రులుగా చాటింగ్ చేసేవారు. ఇంట్లో తల్లిదండ్రులు వేధిస్తున్నారని...వారికి కూడా ఏదైనా పని చూపించమంటూ మెసేజ్‌లు పంపేవారు. వ్యూహంలో భాగంగా అది ట్రాఫికర్ల దృష్టిలో పడింది. వీళ్లని కూడా అపహరిం చేందుకు బాలికల అక్రమ రవాణా ముఠా సిద్ధమైంది. తాము ఉండే ప్రాంతానికి రమ్మంటూ మెసేజ్ పెట్టారు. అది భారత్ నేపాల్ సరిహద్దు ప్రాంతం. సిబిఐ, పోలీసు బృందంతో పాటు తేజ, శివానీలు సైతం అక్కడికి చేరుకున్నారు. అయితే ట్రాఫికర్ల స్థావరాల్లోకి ప్రవేశించడం అక్కడ ఎవరికీ అనుమానంరాకుండా ప్రవర్తించడం చాలా కష్టమైన పని. ఎందుకంటే వాళ్లకేమాత్రం అనుమానం వచ్చినా అది ప్రాణాలకే ప్రమాదం. భయం భయంగానే అక్కడి చేరుకున్నా పోలీసుల సాయంతో ట్రాఫికర్ల చెర నుంచి ఆ చిన్నారిని విడిపించడంలో ఎంతో కృషిచేశారు ఈ ఇద్దరు అమ్మాయిలూ. అందుకుగాను భారత ప్రభుత్వం జాతీయ సాహస బాలల పురస్కారాన్ని అందించింది. ఈ సంఘటన తర్వాత ట్రాఫికింగ్ బృందానికి నేతృత్వం వహించిన వ్యక్తిని గత సంవత్సరం ఢిల్లీలో పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన తర్వాత డార్జిలింగ్‌లో ఆడపిల్లలు పుట్టాల నుకునే వారి సంఖ్య కూడా పెరిగింది..

పదవికాసం - 55

కూర్పు: రావెళ్ల

1		2	■	3		4		5
	■		■		■		■	
6		■	7		8	■	9	
	■	10		■	11	12	■	■
13			■	14	■	15		16
■	■	17	18	■	19		■	
20		■	21	22		■	23	
	■	24	■		■	25	■	
26		28			■	27		

ఆధారాలు

అడ్డం

1. పెద్ద సుత్తి (3)
3. శూన్య హస్తుడు (5)
6. వేగం (2)
7. చేతితో వేయడం (3)
9. తోక తెగిన హంస (2)
10. త్రుంచు (2)
11. చిక్కు (2)
13. ఒక పురుగు (3).
14. వజ్రాయుధంలోని మొదటి అక్షరం (1)
15. తెలుగు సంవత్సరాలలో నలభై రెండోది (3)
17. నీచుడు (2)
19. నాణెం (2)
20. అడుగంటు (2)
21. తన పని (3)
23. రాబడి (2)
26. వియ్యంకుని భార్య (5)
27. జగడమాడు (3)

నిలువు

1.యుద్ధరంగం (5)
2. ఫలసాయం కింద నుండి (2)
3. నేర్పుకలవాడు తిరగబడ్డాడు (3)
4. చంపడం (2)
5. మంచి బాలుడు శీర్షాసనం వేశాడు (3)
7. ఆచరించు (2)
8. వాయువు (2)
10. వరి కుప్పలకు ముందు చేసేపని (3)
12. చలనచిత్ర ప్రదర్శనశాల (3)
16. ఇతరుల స్థలం ఆక్రమించేవాడు (5)
18. ఆద్యంతాలు లేని స్వేచ్ఛాస్వరం (2)
19. పని (2)
20. స్త్రీ (3)
22. ఫుల్‌స్టాప్‌లు కాదు (3)
24. చెంత (2)
25. దుకాణం కింది నుండి (2)

సుడోకు

7		3		1				6
				8				
		6	2			4	5	
9						7	4	
		5		3		6	8	
			4	5			9	
3	7	1				9	6	
	5		1				7	
6					9			

గతవారం జవాబులు

7	6	5	8	1	2	4	9	3
2	8	9	3	6	4	5	7	1
1	4	3	9	5	7	8	6	2
8	7	1	6	2	5	9	3	4
9	5	4	1	3	8	6	2	7
3	2	6	4	7	9	1	5	8
4	3	8	2	9	6	7	1	5
5	9	2	7	8	1	3	4	6
6	1	7	5	4	3	2	8	9

1 అ	■	2 ర	3 మొ	■	4 వా	ణి	■	5 ప్ర
6 ల	7 వం	■	ర	■	స	■	8 ఆ	జ్ఞ
■	9 గ	10 రా	టు	■	11 న	12 క్ష	త్రం	■
13 వం	■	ము	■	14 మ	■	ణం	■	15 భ
16 చిం	దు	■	17 అ	లు	పు	■	18 నా	వ
చు	■	19 నీ	■	పు	■	20 పా	■	నం
■	21 ని	రు	22 డు	■	23 బూ	డి	24 ద	■
25 వ్యా	ధి	■	టు	■	గ	■	26 యా	27 ది
ఖ్య	■	28 రం	భ	■	29 ర	వం	■	ట్ట

ప్రకృతి పాత్ర

కెన్యాలో పుట్టుక... అడవి తల్లికి బిడ్డను చేస్తుందేమో. అందుకేనేమో న్యూజిల్యాండ్ కళాకారుడు గోర్డాన్ పెంబ్రిడ్జ్ ప్రకృతికి తన కళను అంకితం చేస్తున్నాడు. తాను పుట్టిన కెన్యాలోని వన్యలోకాన్ని దానిలో ఆవిష్కరిస్తున్నాడు. కలప పాత్రల్లో కళను వొలికిస్తూ గోర్డాన్ తీర్చిదిద్దిన కెన్యా దృశ్యాలు అద్భుతమనిపిస్తున్నాయి. తాను ఎంచుకున్న కళా వస్తువే కాదు వాటిని మలిచే కలపను కూడా ప్రకృతి హితంగానే తీసుకున్నాడు. తుఫానులకు పెళ్లగిల్లిన చెట్ల నుంచి కలపను సేకరించి చేతితో వన్య దృశ్యాలను తొలిచాడు. తొలి పదేళ్లు కెన్యా అడవుల్లోను ఆ తర్వాత న్యూజిల్యాండ్ ప్రకృతిలోను గడిపేసిన గోర్డాన్ ఫొటోగ్రాఫర్‌గా స్థిరపడ్డాడు. గ్రాఫిక్ డిజైన్, ఫైన్ ఆర్ట్, ఇల్లస్ట్రేషన్, 3డి డిజైన్, వుడ్‌టర్నింగ్ వంటి కళాత్మక అభిరుచుల్లో నైపుణ్యం సాధించాడు. అతడి ఆఫ్రికా, ఓషియానాలను ఓ పాత్రలోంచి మీరూ చూసేయండి.



ఊహాతీత దృశ్యం



అవతార్, టైటానిక్, స్టార్‌వార్స్ వంటి ఊహాతీత చిత్రాల్లోని సన్నివేశాలు గుర్తుండిపోవడానికి లొకేషన్లే కీలకం. చాలావరకు ఇవన్నీ గ్రాఫిక్స్ మాయాజాలం అని ఓ మాటనేసి ఊరుకుంటారు. కానీ వందేళ్ల నాటి ఓ అద్భుత కళ కారణమంటే నమ్ముతారా? అసాధ్యమనుకునే లొకేషన్లను 'మాట్టే పెయింటింగ్' ద్వారా కళ్లెదుట నిలిపేస్తారు. 1905లో నార్మన్ డాన్ అనే ఫొటోగ్రాఫర్ గాజు పలకలపై వేసిన పెయింటింగ్‌లకు ఛాయాచిత్రాన్ని జతచేసి ఈ అద్భుతాన్ని ఆవిష్కరించారు. దాదాపు 80 ఏళ్ల పాటు సినిమాలకు లొకేషన్లను అందించిన ఈ కళను 1985లో క్రిస్ ఎవాన్స్ మలుపు తిప్పారు. డిజిటల్ పెయింటింగ్‌తో మరిన్ని వన్నెలద్ది విభ్రమపరిచే లొకేషన్లను అందించారు. అల్ట్రా రియలిస్టిక్ సన్నివేశాల్ని చిత్రించడంలో మాట్టె పెయింటింగ్ కీలకమైంది. మైక్ పాంగ్రాజియో, రాల్ఫ్ మెక్‌క్వైర్, హారిసన్ ఎల్లెన్‌షా, ఫ్రాంక్ ఓర్డాజ్ వంటి దిగ్గజాల పేర్లు ఈ కళలో ముందు చెబుతారు. జైమె జాస్సో, ఎడ్ లోపెజ్, బ్రెంటెన్ కాట్‌మన్ వంటి కళాకారులు మనకు ఎప్పటికీ మరిచిపోలేని లొకేషన్లను మలుస్తున్నారు. అది ప్రకృతిలో ఓ సన్నివేశమైనా, అంతరిక్షంలో ఓ దృశ్యమైనా. ఈ మాట్టె పెయింటింగ్‌ల్లోని కొన్ని లొకేషన్లను చూసి ఆశ్చర్యపోండి.







Check List

Book Number	KNSR09B161	**Date**	03/09/22
Front Cover	yes	**Back Cover**	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mounika	**Cutting By**	Mouni
Scanned By	[illegible]	**Pages**	29